

# మరణానంతరం జరిగేది-2

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# మరణానంతరం జరిగేది-2



**రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,**

మొదటి ముద్రణ : ఆగస్టు, 2026

ప్రతులు : 1,000

**వెల : రూ. 70/-**

**పుస్తకముల కొరకు :-**

**తటవర్తి వీరరాఘవరావు,**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 12) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 13) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 14) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 15) పంచకోశాలు | - | రూ.60/- |
| 16) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 22) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 23) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 24) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 25) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 26) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 27) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 28) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 29) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

# మరణానంతరం జరిగేది-2

మానవుడు జ్ఞాని కావాలంటే, జీవించి ఉన్నప్పుడు తెలుసుకునే విషయాలే కాకుండా, మరణించిన తర్వాత ఏమి జరుగుతుంది? ఏమవుతుంది? అనే విషయాల గురించి కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ప్రస్తుత జీవితం, అంటే కనిపించే జీవితం, కనిపించని జీవితం మీద ఆధారపడి ఉంటుంది. ఎవరైతే ఈ కనిపించని జీవితం గురించి కూడా అవగాహన కలిగి ఉంటారో! వారి ప్రస్తుత జీవితం చాలా సాఫీగా కొనసాగుతుంది.

ఎందుకంటే ఈ రెండింటికీ చాలా దగ్గర సంబంధం ఉంది. చాలామంది వాటికి సంబంధం లేదని అనుకుంటారు. కానీ వాస్తవానికి వాటి మధ్య ఎంతో సంబంధం ఉంది. ఎందుకంటే కనిపించని జీవితంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారమే ప్రస్తుత జీవితం సాగుతుంది. కనిపించని జీవితంలో ఎంచుకున్న కర్మల ఆధారంగానే ప్రస్తుత జీవితం కొనసాగుతుంది. అలాగే కనిపించని జీవితంలో రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారమే ప్రస్తుత జీవితం నడుస్తూ ఉంటుంది.

పత్రి గారు తరచూ ఏమని చెప్పేవారు అంటే "ప్రణాళిక ప్రకారం జీవిస్తే జీవించినట్టు, ప్రణాళిక ప్రకారం జీవించకపోతే మరణించినట్టు" అన్నారు. అలాగే, కనిపించే జీవితంలో చేసే ప్రతి కర్మ కూడా రికార్డు అవుతుందని, ఆ విషయం కనిపించని జీవితంలోకి ప్రవేశించిన తర్వాత తెలుస్తుందని చెబుతారు. అక్కడ ప్రతి ఒక్కరికీ ఒక ఖాతా ఉంటుంది, అందులో ప్రతి కర్మ నమోదు చేయబడుతుందని అవగాహన కలుగుతుంది.

పత్రి గారు మరో విషయం కూడా చెబుతుండేవారు. "ఈ కనిపించే జీవితం చాలా స్వల్పమైనది, కనిపించని జీవితం చాలా విస్తృతమైనదని",

అందువల్ల ఆ కనిపించని జీవితం గురించి తెలుసుకోకుండా ఈ ప్రస్తుత జీవితాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు అన్నారు.

ఎందుచేతనంటే ఈ కనిపించే జీవితం మాయలో ఉంటుంది, అంటే లేనివి ఉన్నట్లుగా కనిపిస్తాయి, అందుకే చాలామంది ఆ లేని వాటికే ప్రాముఖ్యం ఇస్తూ జీవిస్తారు. కానీ శరీరాన్ని వదిలిన తర్వాత కనిపించని జీవితంలోకి ప్రవేశించినప్పుడు వాస్తవం అర్థమవుతుంది. అప్పటివరకు లేని వాటికే, శాశ్వతం కాని వాటికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చామని గ్రహిస్తారు.

అప్పుడు జీవితాన్ని ఎంత వృథా చేసుకున్నామో, ఎన్ని పొరపాట్లు చేశామో, ఎన్ని తప్పులు చేశామో, ఎంత నష్టపరుచు కున్నామో అర్థమవుతుంది. ఎందుకంటే ఈ భూమిపై జరుగుతున్న జీవితం అసలైన జీవితం కాదు. సాధారణంగా ఇక్కడ ఉన్నదే అసలైన జీవితం అని భావిస్తారు. కానీ అసలైన జీవితం ఏమిటో శరీరాన్ని వదిలిన తర్వాత, సూక్ష్మ లోకాలలో ప్రవేశించినప్పుడు అర్థమవుతుంది.

అక్కడ అనేక లోకాలు ఉన్నాయని, ఆ లోకాలలో ఉన్నత లోకాలను చేరుకోవాలని తెలుస్తుంది. అయితే ఆ ఉన్నత లోకాలను చేరుకోవడానికి అక్కడ చేయడానికి ఏమీ ఉండదు. భూమిపై చేసిన కర్మలు, సంపాదించిన జ్ఞానాన్ని బట్టి నిర్ణయించబడుతుంది.

అందువల్ల భూమిపై ఎంత జ్ఞానం సంపాదిస్తే, అంత లాభం పొందగలమని అర్థమవుతుంది. ఈ విషయాలను భూమిపైనే తెలుసుకున్నవారు, ఆత్మతో కూడిన జీవితాన్ని ఉన్నత స్థితులకు తీసుకెళ్ళాలంటే జ్ఞానాన్ని సంపాదించుకోవాలని గ్రహించి, జ్ఞాన సంపాదన కోసం కృషి చేస్తారు.

ఈ అవగాహన పెరిగే కొద్దీ వారి జీవితం మారిపోతుంది. అంతకు

ముందు వారు ప్రవర్తించిన తీరు ఒక విధంగా ఉంటే, కనిపించని జీవితం గురించి అవగాహన పెరిగిన తర్వాత వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, జీవించే విధానం అన్నీ మారిపోతాయి. ఇంతకు ముందు శారీరక బంధువులతో గడపడానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవారు, కానీ మరణానంతర జీవితం గురించి తెలుసుకున్న తర్వాత ఆత్మబంధువులతో గడపడానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు.

అందుచేత జీవితంలో కేవలం ధన సంపాదనకే ప్రాధాన్యం ఇవ్వకుండా, జ్ఞాన సంపాదనకు కూడా సమయం కేటాయించండి. అప్పుడు మరణానంతర జీవితం గురించి మీకు స్పష్టమైన అవగాహన కలుగుతుంది. ఆ అవగాహనకు అనుగుణంగా జీవిస్తారు. అలా జీవించడం వల్ల మీరు మీ అసలు లక్ష్యానికి మరింత దగ్గరవుతారు.


**తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?**

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

**“మరణానంతర జీవితం గురించి ఎంత అవగాహన ఉంటే, మీరు మీ జీవిత లక్ష్యానికి అంత దగ్గరవుతారు”.**

మరణం తర్వాత ఏమి జరుగుతుందో తెలుసుకున్నప్పుడు, జీవించి ఉన్నప్పుడు ఎలా జీవించాలో కూడా మీకు స్పష్టంగా అర్థమవుతుంది. అప్పుడు మీరు ఆత్మకు లాభం కలిగించే విధంగా జీవించడం ప్రారంభిస్తారు.

ఎవరైతే మరణించిన తర్వాత ఉండే జీవితం గురించి ఎక్కువ అవగాహన కలిగి ఉంటారో, వారు తమ జీవిత లక్ష్యానికి దగ్గరవుతారు.

ఏ మానవుడైనా ముందుగా తెలుసుకోవలసిన విషయం **“నేను దేహం కాదు, నేను ఆత్మను”** అనే సత్యం. **“ఆత్మ అయిన మీకు ఒక లక్ష్యం ఉంది; ఆత్మ చేరుకోవాల్సిన గమ్యం కూడా ఉంది”.** ఆ గమ్యాన్ని చేరుకునే వరకు మీరు జన్మలు తీసుకుంటూ, జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవిస్తూ ఉంటారు.

అంతులేని దుఃఖాల నుంచి బయటపడాలంటే ఆ లక్ష్యాన్ని సాధించాలి. లక్ష్యాన్ని సాధించడం అంటే కేవలం ధ్యానం చేయడం మాత్రమే కాదు, అపారమైన జ్ఞానాన్ని సంపాదించుకోవడం కూడా అవసరం. జ్ఞానం సంపాదించడం అంటే కంటికి కనిపించని విషయాల గురించి అవగాహన పెంచుకోవడం. ముఖ్యంగా మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగి ఉండాలి.

ఎందుకంటే, ప్రస్తుతం ఈ లోకంలో మరణానంతరం ఏమి జరుగుతుందో చాలామందికి సరైన అవగాహన లేదు. అందుకే కనీసం కొంత అవగాహన అయినా సంపాదించుకోవాలి.

ఈ కనిపించే జీవితం చాలా స్వల్పమైనది, కాని కనిపించని జీవితం ఎంతో విస్తృతమైనది. ఆ విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడే మీరు మీ

లక్ష్యానికి దగ్గరవుతారు. ఎప్పుడైతే మీలో ఆ విషయాలపై ఆసక్తి పెరుగుతుందో, వాటిని తెలుసుకోవాలనే శ్రద్ధ పెరుగుతుందో, అప్పుడు అంటే ఈ భూమిపై ఉన్నప్పుడు వాటిని చెప్పగలిగే గురువులు మీకు లభిస్తారు. మీరు శ్రద్ధతో ఆ విషయాలను తెలుసుకుంటూ ఉంటే, మరణించిన తర్వాత కూడా అక్కడ జరిగే సత్సంగాలు, కౌన్సిలింగ్‌లు ద్వారా విన్న విషయాలు మీ ఆత్మలో నిక్షిప్తం అవుతాయి.

తరువాత మీరు మరలా భూమిపై జన్మించినప్పుడు, ఎంత ప్రాపంచిక జీవితంలో ఉన్నా, ఆ జ్ఞానం మీ ఆత్మలో నిక్షిప్తమై ఉండటం వల్ల మీకు లోపల నుంచి ప్రేరణ లభిస్తూ ఉంటుంది. మరణానంతరం తెలుసుకున్న విషయాలకు విరుద్ధంగా శరీరంతో భూమిపై మీరు ప్రవర్తిస్తే, మీ శరీరంలో ఉన్న ఆత్మ దానిని అంగీకరించదు. “మీరు చేయవలసిన పని ఇది కాదు; దీని కోసం మీరు భూమి పైకి రాలేదు” అని హెచ్చరిస్తూ ఉంటుంది.

నిజంగా ఆత్మజ్ఞానం పొందాలనే తపన మీలో ఉంటే, మీకు తప్పకుండా ఒక సద్గురువు లభిస్తారు. ఆయన ద్వారా మీరు ఎన్నో విషయాలను తెలుసుకుంటారు, వాటిని శ్రద్ధగా ఆచరిస్తూ ఉంటారు. మీరు శ్రద్ధతో ఆచరించడం వల్ల, పై లోకాలలో తెలుసుకున్న విషయాలకు అనుగుణంగా జీవించిన వారు అవుతారు. ఒకవేళ పైలోకాలలో తెలుసుకున్న విషయాలకు, భూమిపై మీరు ఆచరించే పనులు విరుద్ధంగా ఉన్నప్పుడు, మీ ఆత్మ మిమ్మల్ని హెచ్చరిస్తూనే ఉంటుంది.

ఆ హెచ్చరికలను గుర్తించి మీ ప్రవర్తనను మార్చుకుంటే, మీరు మీ లక్ష్యానికి మరింత దగ్గరవుతారు. లక్ష్యానికి దగ్గరవుతున్న కొద్దీ పూర్ణాత్మ సహకారం పెరుగుతుంది, ప్రకృతి సహకారం కూడా పెరుగుతుంది. అందువల్ల మీరు మరింత వేగంగా ఆధ్యాత్మికంగా ఎదిగే అవకాశం పొందుతారు.

మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగినప్పుడు, **"భూమిపై ఉండే జీవితం చాలా స్వల్పమని మీకు స్పష్టంగా అర్థమవుతుంది".**

ఈ అవగాహన వచ్చిన తర్వాత మీరు ఆధ్యాత్మిక విషయాలపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు, సమయాన్ని వృథా చేయరు. గమనిస్తే భూమిమీద జీవితం తక్కువ అని అర్థమైనప్పుడు, మమకారాల కోసం ఎంత సమయాన్ని వృథా చేస్తున్నారో తెలుస్తుంది.

చాలామంది ఇంకా చాలా సమయం ఉంది, ఇంకా చాలా జీవితం ఉంది అని భావించి పనులను వాయిదా వేస్తూ ఉంటారు. కానీ మీరు సంపాదించిన జ్ఞానం తక్కువే; ఇంకా సంపాదించాల్సిన జ్ఞానం ఎంతో ఉంది, అని తెలుస్తుంది. అయినప్పటికీ మీరు చిన్న కారణం దొరికినా చేయవలసిన సాధనను వాయిదా వేస్తుంటారు. "వచ్చే నెలలో చూద్దాం"అని కాలాన్ని గడిపేస్తారు.

చివరికి ఇంద్రియ శక్తులు తగ్గిపోతాయి, వృద్ధాప్యం వస్తుంది. అప్పుడు "ఈ జన్మలో ఇక నా వల్ల సాధ్యం కాదు" అనే నిర్ణయానికి వస్తారు. ఇలా మీకు లభించిన సమయాన్ని, అవకాశాన్ని మీరే వృథా చేసుకుంటారు.

శరీరాన్ని విడిచిన తర్వాత ఈ విషయం మరింత స్పష్టంగా తెలుస్తుంది. ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చినా, తగినంత జ్ఞానం సంపాదించలేదని బాధపడతారు. అవకాశం లభించినా ఉపయోగించుకోలేదని విచారిస్తారు. అప్పుడు మరొక జన్మ కోసం ఎదురు చూస్తారు.

జన్మ ఉన్నప్పుడు "నా తల్లి, నా తండ్రి, నా భర్త, నా భార్య, నా

పిల్లలు, నా ధనం" అనే మమకారాలతో ఎంతో సమయాన్ని వృథా చేస్తారు. అవసరం లేకపోయినా ధన సంపాదన కోసం జీవితమంతా ఖర్చు చేస్తారు. ఎన్నో తరాలకు సరిపడా సంపాదించినా, ఇంకా అదే పనిలో మునిగిపోతారు. బంధాలు, మమకారాలు, సంపదల కోసం విలువైన జీవితాన్ని వృథా చేస్తారు.

నిజంగా మరణానంతర జీవితం గురించి అవగాహన ఉన్నవారికి, భూమిపై జీవితం చాలా స్వల్పమని తెలుసు. అందుకే వారు ఎప్పుడైనా నిష్క్రమించాల్సి వస్తుందని గుర్తుంచుకొని జీవిస్తారు. పత్రి గారు చెప్పినట్లుగా, ఆత్మ జ్ఞాని ఎప్పుడూ మరణానికి సిద్ధంగా ఉంటాడు.

ఒక వారం రోజుల్లో మీ జీవితం ముగియబోతుందని మీకు తెలిస్తే, మీరు ఎలా జీవిస్తారో ఒక్కసారి ఆలోచించండి. "ఇది చేసి ఉంటే బాగుండేది, అది చేసి ఉంటే బాగుండేది" అని బాధపడతారు, అందుకే ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.

ప్రయాణానికి వెళ్ళే వ్యక్తి ముందుగానే అన్నీ సర్దుకొని సిద్ధంగా ఉన్నట్లే, ఆత్మ జ్ఞాని కూడా తన జీవిత ప్రయాణానికి సిద్ధంగా ఉంటాడు. చివరి క్షణంలో సర్దుకుందామని అనుకునే వ్యక్తి కంగారుపడతాడు. అలాగే జీవితంలో కూడా చివరి దశలో ఆధ్యాత్మికత గురించి ఆలోచిస్తే ప్రయోజనం తక్కువ.

ఎవరైతే జ్ఞానం సంపాదిస్తూ, ఆత్మ లాభానికి సంబంధించిన సేవలు చేస్తూ, ఆత్మ ఉన్నతికి దోహదపడే కార్యక్రమాలలో పాల్గొంటారో వారు నిశ్చింతగా ఉంటారు, వారికి మరణం నష్టం కాదు.

అందువల్ల భూమిపై ఉండే జీవితం చాలా స్వల్పమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. "ఆరోగ్యం ఎప్పుడు మారుతుందో, ఇంద్రియ శక్తులు ఎప్పుడు తగ్గిపోతాయో, జీవితం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదు". ఈ

అవగాహన ఎక్కువగా ఉండేది మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగినవారికే.

ఈ కారణంగా మీకు లభించిన సమయాన్ని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆత్మ వికాసం కోసం వినియోగించండి. అప్పుడు మాత్రమే మీరు మీ అసలు లక్ష్యానికి దగ్గరవుతారు.

అందుకే అంటారు, **"యోగి చెప్పి చస్తాడు, భోగి చెబితే చస్తాడు"** అని. భోగికి "నువ్వు రేపు చనిపోతావు" అని చెబితే, "అరే! ఇంకా ఏదీ చేయలేదు, దేనిపైనా శ్రద్ధ పెట్టలేదు" అని కంగారుపడిపోతాడు. కానీ యోగి మాత్రం ముందుగానే సిద్ధపడినవాడు కాబట్టి, "నేను రేపు వెళ్లిపోతాను, మూడు రోజుల్లో వెళ్లిపోతాను" అని తెలిసినా నిశ్చింతగా ఉంటాడు. సదానంద యోగిలా ప్రశాంతంగా ఉంటాడు.

అందువల్ల భూమిపై ఉండే జీవితం చాలా స్వల్పమని మీరు గుర్తుంచుకోవాలి. ఏదైనా జబ్బు రావచ్చు, లేదా అనుకోకుండా మీ ఇంద్రియాల శక్తి తగ్గిపోవచ్చు. ఏ క్షణంలో ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు. జీవితం ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందనే గ్యారంటీ ఎక్కడా లేదు.

ఈ అవగాహన ఎవరికి ఎక్కువగా ఉంటుందంటే, మరణానంతర జీవితం గురించి అవగాహన ఉన్నవారికి. వారికి భూమిపై జీవితం చాలా స్వల్పమని స్పష్టంగా అర్థమవుతుంది.

పైలోకాలతో పోలిస్తే, మీరు ఇక్కడ 50 సంవత్సరాలు జీవించినా అది అక్కడ 50 రోజులు మాత్రమే జీవించినట్టు.

అంత స్వల్ప జీవితంలో సగం నిద్రలోనే గడిచిపోతుంది, కొంత బాల్యంలో గడిచిపోతుంది, మరికొంత ముసలితనంలో గడిచిపోతుంది. మిగిలిన జీవితంలో ఎన్నో అవసరాలు, బాధ్యతలు మరియు పనులను

చూసుకోవాల్సి ఉంటుంది.

ఇంక వున్న యవ్వనం ఎంత వుంటుందో వూహించుకోండి. ఒక రోజు గడవాలన్నా ఎన్నో విషయాలను సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుంది. ఆహారం సిద్ధం చేసుకోవడం, తినడం వంటి పనులకే చాలా సమయం వెచ్చించబడుతుంది. మధ్యలో వచ్చే ఇబ్బందులు, అనారోగ్యాలు కూడా మీ విలువైన సమయాన్ని తీసుకుంటాయి.

ఇలా మిగిలే కొద్దిపాటి సమయాన్నే మీరు ఆధ్యాత్మిక సాధనకు కేటాయిస్తున్నారు. కానీ అదే సాధనకు మరింత సమయం కేటాయిస్తే ఎంత గొప్ప లాభం పొందవచ్చో మీరు ఆలోచించాలి.

పత్రి గారు పరిచయమైన తర్వాత నా వ్యాపారాలను వదిలివేయడం వల్ల నా పూర్తి సమయాన్ని ఆత్మ సాధనకు కేటాయించే అవకాశం నాకు లభించింది. నేను గమనిస్తున్నది ఏమిటంటే, ఎంతో మంది ఈ మార్గంలోకి వస్తున్నారు. అయితే వ్యాపారం, ఉద్యోగం లేదా సంపాదనలో ఎక్కువగా నిమగ్నమై ఉండటం వల్ల వారు ఆశించినంతగా ఎదగలేకపోతున్నారు. వారే "మీ అంత జ్ఞానం మాకు లేదు" అని ఒప్పుకుంటున్నారు. కానీ నిజంగా దృష్టి పెట్టి సాధన చేస్తే వారికి కూడా అదే జ్ఞానం లభిస్తుంది.

సంపాదన వున్న వారే కాదు, సంపాదన లేని వారు కూడా కొన్నిసార్లు అదే స్థాయిలో ఉండిపోతున్నారు. కాబట్టి "ఇంకెంత సంపాదించాలి?" అని మీరు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవాలి. భూమిపై ఉండే జీవితం చాలా స్వల్పమని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మరణానంతర జీవితం గురించి అవగాహన ఉన్నవారికి ఈ సత్యం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

**"మరణానంతర జీవితం మీద మీకు ఎంత అవగాహన ఉంటే, మీ జీవిత లక్ష్యానికి అంత దగ్గరవుతారు".** మరణించిన తర్వాత మీరు ఏ లోకానికి

వెళ్తారో, మీరు చేసిన కర్మలు మరియు పొందిన జ్ఞానాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. మీరు ఈ దేహం కాదు, ఆత్మ అనే సత్యాన్ని గ్రహించినప్పుడే మరణానంతర జీవితం గురించి స్పష్టమైన అవగాహన కలుగుతుంది.


మరణించిన తర్వాత ఆత్మ అయిన మీరు కంటికి కనిపించని వివిధ లోకాలలోకి ప్రయాణిస్తారు. ఏ లోకానికి చేరుకోవాలో తెలుసుకోవాలంటే, ముందుగా ఆ లోకాల గురించి అవగాహన కలిగి ఉండాలి. మరణానంతర లోకాలపై అవగాహన లేకపోతే, జీవితాన్ని సరైన లక్ష్యంతో గడపడం సాధ్యం కాదు.

ఈ భూలోకం మాత్రమే కాకుండా ఇంకా అనేక లోకాలు ఉన్నాయని తెలుసుకోవాలి. జన లోకానికి పైన మూడు లోకాలు, క్రింద మూడు లోకాలు ఉన్నాయని శాస్త్రాలు వివరిస్తాయి. అన్ని లోకాలలో అత్యున్నతమైనది సత్యలోకం. ప్రతి మానవుని లక్ష్యం సత్యలోకాన్ని చేరుకోవడమే. ఆ లక్ష్యాన్ని సాధించే వరకు మీరు జనన-మరణ చక్రంలో తిరుగుతూనే ఉంటారు. ప్రతి జన్మతో పాటు అనేక రకాల బాధలు, మరియు కష్టాలు కూడా అనుభవించాల్సి వస్తుంది. ఈ బాధల నుండి విముక్తి పొందాలంటే జన్మ రహిత స్థితిని సంపాదించడానికి ప్రయత్నించాలి. ఆ స్థితిని పొందాలంటే మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవాలి.

మరణించిన తర్వాత జీవులు చేరుకునే లోకాలు అనేక రకాలుగా ఉంటాయి. ఈ కోటానుకోట్ల లోకాలలో మీరు చేసే కర్మలను బట్టి మీ గమ్యం నిర్ణయించబడుతుంది. పాప కర్మలు చేసినవారు ఒక విధమైన లోకాలకు చేరుకుంటారు, పుణ్య కర్మలు చేసినవారు మరొక విధమైన లోకాలకు చేరుకుంటారు. ఉన్నత లోకాలను లేదా ఊర్ధ్వ లోకాలను చేరుకోవాలంటే

జ్ఞానాన్ని సంపాదించుకోవడం అత్యంత అవసరం. చనిపోయిన తర్వాత మీ పిల్లలు చేసే కర్మకాండలు వల్ల ప్రయోజనం ఉండదు. మీరు చేసిన కర్మలు మరియు సంపాదించిన జ్ఞానమే మీ గమ్యాన్ని నిర్ణయిస్తాయి.

ఇది తెలియక చాలామంది మరణించిన తర్వాత తప్పనిసరిగా కర్మకాండలు చేయాలని నమ్ముతారు. ఈ కర్మకాండలు పుత్రులే చేయాలనే విశ్వాసం వల్ల కొడుకు పుట్టాలనే కోరిక కూడా చాలామందిలో ఉంటుంది. అయితే జ్ఞానం సంపాదించిన తర్వాత, మహానుభావులు మరియు యోగులు ఇచ్చిన సందేశాలను బట్టి ఒక విషయం స్పష్టమవుతుంది. మానవులు భూమిపై చేసే కర్మకాండలు, లేదా వారు చేసే దానధర్మాలను బట్టి వారు చేరుకునే లోకాలు నిర్ణయించబడవు. వారు స్వయంగా సంపాదించుకున్న జ్ఞానాన్ని బట్టే ఉన్నత లోకాలు, ఊర్ధ్వ లోకాలు చేరుకునే అవకాశం లభిస్తుంది.



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

**“మరణానంతర జీవితం గురించి అవగాహన పెరిగినవారు తప్పకుండా జ్ఞానం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తారు”.**

ఎందుకంటే జ్ఞానం వల్ల కలిగే లాభాలు ఎన్నో ఉన్నాయి. మీరు ఆత్మ అని తెలుసుకోవడం, ఆ ఆత్మకు నిజమైన లాభాన్ని కలిగించేది జ్ఞానమే అని గ్రహించడం ఆధ్యాత్మిక ప్రయాణంలో అత్యంత ముఖ్యమైన దశ. ఈ అవగాహన కలిగిన తర్వాత మరణించిన తర్వాత ఏమవుతుంది, ఏ లోకాలు ఉన్నాయి, ఎవరు ఏ లోకానికి వెళ్తారు వంటి విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి సహజంగానే పెరుగుతుంది.

ఈ సృష్టిలో జనాలోకానికి పైన మూడు లోకాలు, క్రింద మూడు లోకాలు ఉన్నాయని చెప్పబడింది. పాప కర్మలు చేసినవారు భువర్లోకం చేరుతారు, పుణ్య కర్మలు చేసినవారు సువర్లోకం చేరుతారు, జ్ఞానం పొందినవారు జన లోకానికి పైన ఉన్న ఊర్ధ్వ లోకాలకు చేరుకుంటారు. జ్ఞానం పరాకాష్టకు చేరుకున్నవారు అత్యున్నతమైన సత్యలోకాన్ని చేరుకుంటారు. ఆ స్థితిని పొందిన వారికి మరలా జన్మ ఉండదు.

ఈ విషయాలను బట్టి కర్మకాండల కంటే జ్ఞానమే ముఖ్యమని అర్థమవుతుంది. కబీర్‌దాసు చెప్పినట్లుగా, ఇంటి వద్ద నూతిలో నీళ్లు తోడి పోస్తే దూరంలోని పొలానికి చేరనట్లే, ఇక్కడ చేసే కర్మకాండలు లేదా పిండప్రదానాలు ఆ లోకాలలో ఉన్నవారికి ఉపయోగపడవని ఆయన సందేశం ద్వారా అర్థమవుతుంది. అలాగే ఒకరు చేసిన కర్మల ఫలితాన్ని మరొకరు అనుభవించలేరు. ఎవరు చేసిన కర్మల ఫలితాన్ని వారే అనుభవించాలి. ఈ సత్యాన్ని వాల్మీకి మహర్షి జీవిత కథ కూడా తెలియజేస్తుంది.

మరణానంతరం చేరుకునే లోకాలు భూమిపై ఉన్నప్పుడు సంపాదించుకున్న జ్ఞానం మరియు చేసిన కర్మల మీద ఆధారపడి ఉంటుందని తెలుసుకున్నప్పుడు, జ్ఞాన సంపాదనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం ప్రారంభిస్తారు. మహనీయులు, యోగులు, గురువులు అందించిన బోధల ద్వారా ఈ విషయాలను తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అందువల్ల మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవడం అత్యంత ముఖ్యమైన విషయం. చాలామంది ఈ జీవితంలో సుఖము, సంతోషాల గురించే ఎక్కువగా ఆలోచిస్తారు. కానీ జీవించి ఉన్నప్పుడే మరణానంతరం ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఎందుకంటే ఆ జ్ఞానం ఇంద్రియాలకు అందేది కాదు. అతీంద్రియ శక్తులను సంపాదించుకున్న యోగులు, యోగీశ్వరులు తమ అనుభవాల ద్వారా ఈ విషయాలను తెలుసుకుని మనకు తెలియజేశారు. వారి అనుభవాలు మరియు సందేశాల ద్వారా మీరు కూడా ఈ జ్ఞానాన్ని పొందగలుగుతారు.

భూమిపై చేసే కర్మకాండల వల్ల కాదు, చేసిన కర్మలు మరియు సంపాదించిన జ్ఞానం వల్లే ఆత్మ చేరుకునే లోకాలు నిర్ణయించబడతాయని తెలుసుకున్నప్పుడు, ప్రతి వ్యక్తి జ్ఞానాన్ని సంపాదించడానికి మరింత శ్రద్ధ చూపుతాడు. ఎందుకంటే భౌతిక సంపదలు, భోగాలు, ఆస్తులు అన్నీ శరీరంతోనే ఉండిపోతాయి. కానీ శరీరం ఉన్నప్పుడు సంపాదించిన జ్ఞానం మరణానంతరం కూడా జీవికి గొప్ప ప్రయోజనాలను అందిస్తుంది. ఆ జ్ఞానం వల్ల పునర్జన్మలకు కారణమయ్యే కర్మలు దగ్ధమవుతాయి, భవిష్యత్ జన్మలు కూడా మరింత ఉన్నతంగా మారుతాయి.

అందుకే ఆత్మ ఎదుగుదలకు దోహదపడే పనులు ఏమిటో, ఆత్మకు నిజమైన లాభం ఏమిటో తెలుసుకొని వాటిని ఆచరించడం అవసరం. జ్ఞానం,

సాధన, ఆత్మ వికాసం ద్వారా ఉన్నత లోకాలను చేరుకోవడం అంటే జీవిత పరమ లక్ష్యానికి మరింత దగ్గరవడం అని అర్థం.

చూడండి మరణానంతర జీవితం మీద అవగాహన ఉంటే లక్ష్యానికి మరింత దగ్గరవుతారని చెప్పుకున్నాం. దీని అర్థం ప్రతి ఒక్కరూ తప్పకుండా మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవాలి, ఇందులో ఎలాంటి సందేహం లేదు.

మరణించిన తర్వాత మొదటగా అర్థమయ్యే విషయం, "నేను దేహం కాదు, నేను ఆత్మను" అన్న సత్యం. అప్పటివరకు శరీరం మరియు ఆత్మ కలిసి ఉంటాయి. ఆత్మ ఎవరికీ కనిపించదు, శరీరమే కనిపిస్తుంది. అందువల్ల మీరు ఈ శరీరమే నేను అని భావిస్తూ, ఈ శరీరానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ, శారీరక సుఖాల కోసం ప్రయత్నిస్తారు.

సుఖంగా జీవించాలంటే డబ్బు అవసరమని భావించి, ఆ డబ్బు సంపాదన కోసమే జీవితమంతా వెచ్చిస్తారు. బాగా సంపాదించి, బాగా సుఖపడుతూ ఉంటే తాము ఎంతో అదృష్టవంతులమని భావిస్తారు. ఎవరైనా సంపాదించకపోతే వారిని దురదృష్ట వంతులుగా కూడా చూస్తారు.

ఇలా జీవితమంతా దేహం కోసమే అన్ని పనులు చేస్తూ ఉంటారు. కానీ మరణించిన వెంటనే ఆ శరీరం నుంచి ఆత్మ బయటకు వస్తుంది. కొంతసేపటికి తర్వాత ఆ శరీరాన్ని దహనం చేస్తారు. అప్పుడు ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది.

"ఈ జన్మంతా ఆ శరీరం కోసమే ఎంత కష్టపడ్డాను! చేయకూడని పనులు చేశాను, తప్పులు చేశాను. నా సమయం, శక్తి, సంపద అన్నింటినీ ఆ శరీరం కోసమే వెచ్చించాను. ఇంతకీ ఆ శరీరం నేను కాదా?" అనే ప్రశ్న రావడమే కాదు, దాని సమాధానం కూడా స్పష్టంగా అర్థమవుతుంది.

ఎందుకంటే ఆ శరీరం తగలబడిపోయింది, కానీ మీరు అంటే 'ఆత్మ' మాత్రం ఉంది, అంటే మీరు దేహం కాదు, ఆత్మ అన్న దానికి ప్రత్యక్ష అనుభవం.

మీరు అక్కడ ఉన్నవాళ్ళు ఏడుస్తూ ఉండడాన్ని చూసి ఆశ్చర్యపోతారు. "నేను ఇక్కడే ఉన్నాను కదా? మరి వీరు ఎందుకు ఏడుస్తున్నారు?" అని భావించి వారి దగ్గరకు వెళ్తారు. "నాకు ఏమీ కాలేదు, నేను ఇక్కడే ఉన్నాను" అని చెప్పడానికి ప్రయత్నించినా, వారు మిమ్మల్ని పట్టించుకోరు. ఎందుకంటే ఆత్మగా ఉన్న మీరు చెప్పేది వారికి వినిపించదు. అయితే వారి ఏడుపులు, మాటలు మాత్రం మీకు వినిపిస్తూ ఉంటాయి.

ఎవరైనా మరణానంతరం జరిగే విషయాలను ముందుగానే తెలుసుకుంటే, "నేను ఆత్మను" అనే సత్యం వారికి స్పష్టంగా అర్థమవుతుంది. అలాగే "ఈ దేహం నేను కాదు" అన్న విషయం కూడా తెలుస్తుంది. దేహం కోసం చేసిన ఎన్నో పనులు చివరికి వ్యర్థమవుతాయని కూడా గ్రహిస్తారు.

అందువల్ల, జీవించి ఉన్నప్పుడే మరణానంతరం జరిగే విషయాలపై అవగాహన కలిగినవారు, "నేను ఆత్మను" అన్న భావంతో జీవించడం ప్రారంభిస్తారు, ఆత్మకు ప్రాముఖ్యం ఇవ్వడం మొదలుపెడతారు. ఇంతకు ముందు దేహానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి, తాము దేహమే అన్న భావంతో జీవించి ఉండవచ్చు, కానీ ఈ అవగాహన కలిగిన తర్వాత ఆత్మకే ప్రాముఖ్యం ఇస్తారు.

సద్గురువులు, యోగులు, యోగీశ్వరుల సాంగత్యం వల్ల ముఖ్యంగా మరణానంతర జీవితం గురించి అవగాహన పెరుగుతుంది. వారి ద్వారా ఈ విషయాలను తెలుసుకోవచ్చు, దాని ఫలితంగా జీవితంలో మార్పు వస్తుంది. దేహానికి ఇచ్చే ప్రాముఖ్యం తగ్గి, ఆత్మకు ఇచ్చే ప్రాముఖ్యం పెరుగుతుంది.

ఈ మార్గంలో సాధన చేసినవారు, ముఖ్యంగా ధ్యాన సాధనను

తీవ్రంగా ఆచరించినవారు, మూడో కన్ను తెరచుకోవడం ద్వారా "నేను ఆత్మను, దేహం కాదు" అనే సత్యాన్ని గ్రహిస్తారు. అందువల్ల వారు ఆత్మకే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు.

నా విషయానికి వస్తే, పత్రి గారి పరిచయం అయిన తర్వాత ఆయన స్పష్టంగా **"నువ్వు దేహం కాదు, ఆత్మవు"** అని చెప్పారు. మొదట అది నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. కానీ అంత గొప్ప వ్యక్తి చెప్పిన మాట కాబట్టి లోతుగా ఆలోచించాను. ఆయన చెప్పినది సత్యమని నిర్ధారించుకున్న తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది.

అలాగే రమణ మహర్షి వంటి మహనీయులు ఎంతో సాధన చేయడం వల్ల దేహానికి ప్రాముఖ్యం ఇవ్వలేదు, వారు ఆత్మకే ప్రాధాన్యం ఇచ్చారు. యోగులు, బాలయోగులు, అవధూతలు, సిద్ధులు కూడా భోగాలను, సుఖాలను వదిలి సాధన మీదే ఎక్కువ దృష్టి పెట్టడానికి ముఖ్య కారణం "నేను ఆత్మను" అని తెలుసుకోవడమే. ఆత్మ లాభం, ఆత్మ ఉన్నతి కోసం అవసరమైన వాటినే వారు ముఖ్యంగా భావిస్తారు.

మీరు ఉత్తర భారతదేశంలో అనేక ప్రాంతాలకు వెళితే, ప్రాపంచిక జీవితాన్ని వదిలి ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ, ఆత్మ లాభం కోసం జీవిస్తున్న వారిని ఎక్కువగా చూడవచ్చు. అయితే కుటుంబ బాధ్యతలు, ఉద్యోగం, వ్యాపారం వంటి వాటిని నిర్వహిస్తూ జీవిస్తున్న మీరు కూడా ఈ అవగాహన కలిగినప్పుడు ఆత్మకు కొంత సమయాన్ని కేటాయించడం ప్రారంభిస్తారు. పత్రి గారు కూడా ఇదే చెప్పేవారు. "దేహ అవసరాలను చూసుకోండి, అవసరాలకు సంపాదించండి, సంపాదనను మానకండి. కానీ ఖాళీ సమయాన్ని ఆత్మకు కేటాయించండి" అని చెప్పేవారు.

ఉద్యోగం లేదా వ్యాపారం చేస్తూ రోజంతా బిజీగా ఉండే వారికి

సమయం సరిపోదు అని అనిపించవచ్చు. కానీ ఈ అవగాహన ఉన్నప్పుడు, ఉన్నంతలోనే కొంత సమయాన్ని కేటాయించ గలుగుతారు. ఇలా కొంత సమయాన్ని ఆత్మ లాభానికి, ఆత్మ సేవకు కేటాయించడం వల్ల భవిష్యత్తులో మరింత అనుకూలమైన జన్మ లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా లేకపోయినా, ఉన్న జీవితంలో కొంత సమయాన్ని కేటాయించి కృషి చేయడం ద్వారా మరింత అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. అలాంటి వారు తమ సమయాన్ని ఎక్కువగా ఆత్మ లాభం కోసం వినియోగిస్తారు. వారి జీవన విధానం పూర్తిగా మారిపోతుంది, నా జీవితంలో కూడా ఇదే జరిగింది.

అప్పుడు మీరు ఏ పని చేసినా, “ఇది దేహానికి లాభమా? ఆత్మకు లాభమా?” అని ప్రశ్నించు కోవడం ప్రారంభిస్తారు. ఒక ధ్యాన కార్యక్రమానికి వెళ్ళాలా? పెళ్ళికి వెళ్లాలా? రిసెప్షన్‌కు వెళ్ళాలా? అనే సందర్భాల్లో కూడా అదే ఆలోచన చేస్తారు.

“అక్కడికి వెళ్ళడం వల్ల ఆత్మకు లాభమా? లేక కేవలం దేహానికి సంబంధించిన విషయమా?” అని పరిశీలిస్తారు. అది కేవలం శరీరానికి సంబంధించిన విషయమని అనిపిస్తే, దానికి ఇచ్చే ప్రాముఖ్యం తగ్గుతుంది. అవసరమైతే మొక్కుబడిగా వెళ్ళి తిరిగి వస్తారు. ఆధ్యాత్మిక స్థాయి మరింత పెరిగితే అలాంటి కార్యక్రమాలకు వెళ్ళడం కూడా తగ్గిపోతుంది.

అదే సమయంలో ఆత్మకు లాభం కలిగించే భీమవరం క్లాసులకు గానీ, కద్తాల్ లో జరిగే క్లాసులకు గానీ ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. అందువల్ల వారి జీవితం పూర్తిగా మారిపోతుంది.

ఒకప్పుడు నేను ప్రతి ఫంక్షన్‌కు వెళ్లేవాడిని. వెళ్లకపోతే ఇతరులు ఏమనుకుంటారో అని ఆలోచించేవాడిని. “రేపు మన కార్యక్రమానికి వాళ్ళు

వస్తారో! రారో!” అనే భావం కూడా ఉండేది. అందుకే తప్పకుండా వెళ్లేవాడిని. ఫంక్షన్‌లకే కాదు, మరణ సందర్భాలకు కూడా వెళ్లేవాడిని. ఎందుకు వెళ్తున్నానో తెలియకపోయినా, అది పుణ్యమని విన్న కారణంగా అలానే చేసేవాడిని. అప్పుడు నా జీవితం ప్రధానంగా వ్యాపారం, సంపాదన, సామాజిక కార్యక్రమాలు వీటి చుట్టూనే తిరిగేది. అలా దాదాపు యాభై సంవత్సరాలు గడిచిపోయాయి.

కానీ పత్రి గారి పరిచయం అయ్యి, “నేను ఆత్మను” అన్న సత్యం అర్థమైన తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది. జీవించే విధానంలో ఒక గొప్ప మలుపు వచ్చింది. నిజంగా చెప్పాలంటే అది ఒక యూటర్న్ లాంటిది. అలాగే జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా, తాము దేహమే అని భావించే వారికి పరిష్కారం దొరకదు. కానీ మీరు ఆత్మను అన్న భావంతో ఆలోచిస్తే, మీ సమస్యలకు నిజమైన పరిష్కారం కనిపిస్తుంది.

మీరు గమనించండి, ఆత్మ గురించి అవగాహన కలిగిన వారికి బాధ్యతలు కూడా మారిపోతాయి. అంతవరకు “నేను సంపాదించాలి, భార్యా పిల్లలను పోషించాలి, ఇదే నా బాధ్యత” అని ఒక పురుషుడు భావిస్తాడు. అలాగే ఒక స్త్రీ “ఇంటిని చూసుకోవాలి, పిల్లలను చూసుకోవాలి, ఈ బాధ్యతలన్నీ నిర్వర్తించాలి, ఇదే నా కర్తవ్యం” అని అనుకుంటుంది. ఆ భావంతోనే జీవిస్తూ బాధ్యతలను నిర్వర్తిస్తారు.

కానీ “నేను ఆత్మను” అనే అవగాహన వచ్చిన తర్వాత బాధ్యతల పట్ల దృష్టి కోణం మారిపోతుంది. జీవితంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి, అవసరాలు కూడా మారిపోతాయి. దేహ అవసరాలను తగ్గించుకుంటూ, ఆత్మ అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

నా జీవితంలో కూడా ఇదే జరిగింది. పత్రి గారి పరిచయానికి ముందు ఉన్న జీవితానికి, ఆ తర్వాతి జీవితానికి అసలు సంబంధమే లేదు.

పరిచయాలు మారిపోయాయి. అప్పట్లో ఉన్న పరిచయాలు వేరు, ఇప్పుడు ఉన్న పరిచయాలు వేరు. ఇప్పుడు మీరందరూ నా పరిచయస్తులయ్యారు. ఒకప్పుడు బంధువులు, వినోదాలు, సరదాలు ప్రధానంగా ఉండేవి. ఇప్పుడు అవన్నీ మారిపోయాయి, జీవితం మొత్తం మారిపోయింది.

కొన్నిసార్లు నాకు జీవించి ఉండగానే మరో జన్మలోకి ప్రవేశించినట్లుగా అనిపిస్తుంది, అంతటి మార్పు వచ్చింది, మాట్లాడే విధానం కూడా మారిపోయింది. ఒకప్పుడు అవసరం లేని విషయాలు, ఇతరుల సంపాదనలు, అభివృద్ధులు, పెళ్లిళ్లు, సామాజిక విషయాల గురించే ఎక్కువగా మాట్లాడే వాళ్ళం. ఇప్పుడు అలాంటి మాటలు దాదాపు పూర్తిగా పోయాయి. మాట్లాడితే ఆధ్యాత్మిక విషయాల గురించే మాట్లాడుతున్నాం.

దీని ఫలితంగా ఒకప్పుడు చాలా దగ్గరగా ఉన్న బంధువులు, పరిచయస్తులు కూడా క్రమంగా దూరమయ్యారు. గత ఇరవై మూడు సంవత్సరాల్లో చాలామంది నన్ను పూర్తిగా మర్చిపోయారు. ఒకప్పుడు అందరిలో ప్రముఖంగా ఉండే వాడిని, ఇప్పుడు చాలామందికి నేను ఉన్నాననే విషయం కూడా గుర్తు లేదు, ఈ మార్పు చూసి కొందరు ఆశ్చర్యపడుతుంటారు.

ఇప్పుడు కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. జ్ఞానులు, యోగులు, సాధకులు వంటి వారు జీవితంలోకి వచ్చారు. చదివే పుస్తకాలు కూడా మారిపోయాయి. ఒకప్పుడు వారపత్రికలు, మాసపత్రికలు, డిటెక్టివ్ నవలలు చదివేవాడిని. ఇప్పుడు ఎక్కువగా ఆధ్యాత్మిక పుస్తకాలే చదువుతున్నాను.

ప్రస్తుతం నా పరిస్థితి ఏమిటంటే, శరీర అవసరాలను చూసుకుంటూనే నా సమయం, ధనం, శక్తి, జీవితం అన్నింటినీ ఆత్మ లాభం మరియు ఆత్మ ఉన్నతి కోసం వినియోగిస్తున్నాను. అంతేకాకుండా, ఒకప్పుడు దేహ సేవలకు సంబంధించిన కార్యక్రమాలు చేసేవాడిని. అన్నదానాలు, వైద్య

సేవలు, ఆర్థిక సహాయం వంటి సేవల్లో పాల్గొనేవాడిని.

ఇప్పుడు ప్రధానంగా ఆత్మ లాభానికి సంబంధించిన కార్యక్రమాలనే నిర్వహిస్తున్నాను. యజ్ఞాలు, వర్క్‌షాప్‌దీలు, ధ్యాన శిబిరాలు, జ్ఞాన ప్రచారం, జూమ్ సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నాను. ఆత్మకు లాభం కలిగించే, ఆత్మ ఉన్నతికి దోహదపడే విషయాలకే ప్రాముఖ్యం ఇస్తున్నాను. దేహ సేవల కంటే ఆత్మ సేవలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాను.

ఈ మార్పుకు కారణం "నేను ఆత్మను" అనే అవగాహన కలగడమే. కొందరికి "నువ్వు దేహం కాదు, ఆత్మవు" అని చెప్పినా అర్థం కాదు, వారు మామూలుగానే జీవిస్తారు. ఇవన్నీ ఎవరికీ తెలియవు, ఉన్నంతలో సంపాదించుకుని సుఖంగా ఉండాలి అని అనుకుంటూ జీవిస్తారు.

కానీ నాకు మాత్రం పత్రి గారి పరిచయం తర్వాత ఎంతో మార్పు వచ్చింది, అప్పటి జీవితానికి, ఇప్పటి జీవితానికి అసలు సంబంధమే లేదు, పూర్తిగా మారిపోయింది, ఆ మార్పు నాకే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

అలాగే జీవిత లక్ష్యాలు కూడా మారిపోతాయి. మీరు దేహంగా భావిస్తే లక్ష్యాలు ఒక విధంగా ఉంటాయి. "నేను ఆత్మను" అనే అవగాహన వచ్చిన తర్వాత జీవిత లక్ష్యం పూర్తిగా మారిపోతుంది, అలా అన్నీ మారిపోతాయి.

అందువల్ల మరణానంతర జీవితం గురించి స్పష్టమైన అవగాహన ఉన్నవారు తమ అసలు లక్ష్యంపైనే దృష్టి పెడతారు. జీవితంలో ఏ విషయాల వల్ల నష్టపోతున్నారో కూడా స్పష్టంగా గుర్తించగలుగుతారు. గతంలో జీవించిన విధానాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే, ఎంత సమయం వృథా అయిందో, ఎన్నో విషయాల్లో ఎంత నష్టపోయారో అర్థమవుతుంది.

ఒక రకంగా చెప్పాలంటే జీవితం పూర్తిగా మారిపోతుంది. ధనాన్ని

వినియోగించే విధానం కూడా మారిపోతుంది. ఒకప్పుడు సరదాలు, వినోదాల కోసం ఖర్చు చేసేవారు. ఇప్పుడు అలాంటివి తగ్గిపోతాయి. బదులుగా పది మందికి ఉపయోగపడే కార్యక్రమాలు, ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ, జ్ఞాన ప్రచారం వంటి వాటిపై ఆసక్తి పెరుగుతుంది.

మీరు దేహంగా భావిస్తే జీవన విధానం ఒకలా ఉంటుంది. మీరు ఆత్మను అనే అవగాహన కలిగితే పూర్తిగా భిన్నంగా మారిపోతుంది. దేహానికి, ఆత్మకు మధ్య ఉన్న తేడా స్పష్టంగా తెలుస్తుంది. ఈ మార్పు రాకపోతే, మరణానంతర జీవితం గురించి సరైన అవగాహన ఇంకా ఏర్పడలేదని అర్థం చేసుకోవచ్చు. గత జన్మల నుంచి మీరు ఆత్మ విషయాల్లో కొంత కృషి చేసి ఉంటే, ఈ జన్మలో కుటుంబం, సమాజం, పరిస్థితుల ప్రభావంతో సాధారణ జీవితంలో ఉన్నప్పటికీ, ఎవరైనా ఈ ఆధ్యాత్మిక విషయాలను మీకు చెప్పినప్పుడు మీరు వాటి పట్ల ఆకర్షితులు అవుతారు.

ఆ తర్వాత మీ జీవితం క్రమంగా మారడం ప్రారంభమవుతుంది. బయటి వారికి మీరు చేస్తున్న పనులు విచిత్రంగా అనిపించవచ్చు. “ఇలా ఎందుకు మారిపోయారు?” అని ఆశ్చర్యపడవచ్చు. కానీ మీకు మాత్రం ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది  ఇంతవరకు గడిపిన జీవితంలో ఎంతో సమయం వృథా అయిందని. ఇప్పుడు మీరు సాధన చేస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండడం చూసి బయటి వారు “జీవితాన్ని వృథా చేస్తున్నారు” అని అనుకోవచ్చు. కానీ మీ అవగాహన ఏమిటంటే “ఇంతవరకు గడిచిందే వృథా జీవితం, ఇప్పుడు నేను జీవిస్తున్నదే సరైన జీవితం” అని.

ఇదంతా కూడా “నేను ఆత్మను” అనే సత్యాన్ని తెలుసుకోవడం వల్ల, మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవడం వల్ల కలిగే మార్పు. అందుకే ఆధ్యాత్మిక పుస్తకాలను ఎక్కువగా చదవాలని, మళ్ళీ మళ్ళీ

చదవాలని చెబుతారు.

ప్రాపంచిక వ్యవహారాల్లో మునిగిపోవడం అంటే మాయలో జీవించడం. ఆధ్యాత్మిక అవగాహనతో జీవించడం అంటే వాస్తవంలో జీవించడం. జీవించే విధానంలో ఇంతటి మార్పు వస్తే, మీరు మాయ నుంచి బయటపడుతున్నారని అర్థం.

ఒక విషయం మాత్రం ఎప్పటికీ గుర్తుంచుకోండి చనిపోయిన తర్వాత... మీరు సంపాదించుకున్నవి అన్ని కూడా మాయమైపోయేవే. వాటికి అత్యధిక ప్రాముఖ్యం ఇచ్చినవారు చివరికి నిరాశ చెందుతారు. ఈ సత్యాన్ని ముందుగానే తెలుసుకున్నవారు నిజంగా అదృష్టవంతులు.

ఎవరి మాట ఎలా ఉన్నా, నా జీవితంలో పత్రిగారు ప్రవేశించిన తర్వాతే నాలో విపరీతమైన మార్పులు వచ్చాయి. అంతకుముందు డబ్బు సంపాదించడం మాత్రమే తెలుసు, కానీ జ్ఞాన పరంగా ఏమీ తెలియదు.

ఆయన పరిచయం అయిన తర్వాత, ఈ 23 సంవత్సరాలుగా నేను ఎన్నో వీడియోలు చేస్తున్నాను, ఎన్నో పుస్తకాలు వ్రాశాను, ఎన్నో క్లాసులు చెప్పగలుగుతున్నాను, ఎన్నో చోట్ల తిరగగలుగుతున్నాను. ఇదంతా ఆయన పరిచయం అయిన తర్వాతే సాధ్యమైంది. అందుకే నేను ఎక్కడ క్లాస్ చెప్పినా, ఆయన్ని ఒక్కసారి తలుచుకొని క్లాస్ చెబుతుంటాను.

ఎందుచేతనంటే, మరణానంతర జీవితం గురించి అవగాహన ఉన్న వారి జీవితానికి, ఆ అవగాహన లేని వారి జీవితానికి చాలా తేడా ఉంటుంది. రెండింటికీ అసలు సంబంధమే ఉండదు. నా జీవితంలో కూడా అదే జరిగింది. పత్రిగారి పరిచయం కాక ముందు నా జీవితం ఒకలా ఉండేది. పత్రి గారు పరిచయం అయిన తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది.

దానికి ముఖ్య కారణం మరణానంతర జీవితం మీద అవగాహన

ఉండడం వల్ల, అసలు ఈ దేహం నేను కాదు అని అర్థమవుతుంది. ఈ దేహాన్ని కొన్నాళ్లకు వదిలేస్తారు. దీనిని బూడిద చేసేస్తారు, అదృశ్యమైపోతుంది. కానీ ఉండేది ఆత్మ, అదే నేను అన్నది అర్థమవుతుంది.

ఈ అవగాహన ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువగా ఆత్మ కోసం జీవిస్తారు. ఆత్మకు ప్రాముఖ్యం ఇస్తారు, ఆత్మ లాభాల కోసం కృషి చేస్తారు, ఆత్మ ఉన్నతి కోసం ప్రయత్నిస్తారు. ఏది ఆత్మకు లాభిస్తుందో దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఏది ఆత్మకు లాభం కలిగించదో దానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తారు, అంతలా జీవితం మారిపోతుంది.

మీరు “నేను ఆత్మను” అన్న అవగాహనతో చూసుకుంటే, జీవితంలో అందరూ ఏదో ఒక వృత్తి, వ్యాపారం లేదా ఉద్యోగం చేసి డబ్బు సంపాదిస్తారు. కానీ ఎన్ని కోట్లు సంపాదించినా, వందల వేల కోట్లు సంపాదించినా, అది ఆత్మకు కొద్దిగా కూడా లాభించదు. కానీ మీరు సంపాదించుకునే జ్ఞానమే ఆత్మకు లాభిస్తుంది.

ఇది అర్థమైనవారు జ్ఞాన సంపాదన మీద ఎక్కువ దృష్టి పెడతారు, ధన సంపాదన మీద దృష్టి తగ్గిస్తారు. అదే నా జీవితంలో జరిగింది. నా జీవితంలో సడన్‌గా వచ్చిన మార్పును చూసి, ఎంతో మంది ఆశ్చర్యపోయారు.

“ఏమిటి? వీడు బ్రహ్మాండంగా జరిగే వ్యాపారాలన్నీ ఆపేసి, ఏదో గురువు, గురువు అనుకుంటూ బయలుదేరాడు, పిచ్చోడిలా ఉన్నాడు” అని అనుకున్నారు. కానీ నాలో ఇంత మార్పు ఎందుకు వచ్చిందో నాకు తెలుసు, ఇతరులకు తెలియదు. అయితే సంవత్సరాలు గడిచే కొద్దీ, ఇప్పుడు అందరికీ అర్థమైంది. “వాడు చేసిన పనే సరైనది, మనకు ఆ అవగాహన లేదు, వాడిలా మనం చేయలేము” అని సరిపెట్టుకున్నారు.

**“మరణానంతర జీవితం మీద అవగాహన పెంచుకుంటే, జీవితంలో ఏ విషయాల్లో మీరు నష్టపోతున్నారో బాగా తెలుస్తుంది”.** ముఖ్యంగా **“ధన సంపాదన కోసం సమయం వెచ్చించి, ఆత్మ పరంగా ఎంత నష్టపోతున్నారో అర్థమవుతుంది”.**

ఈ శరీరాన్ని సుఖపెట్టడానికి, భోగాలలో ఉంచడానికి ఎంత ప్రయత్నిస్తున్నారు? దాని వల్ల ఆత్మకు ఏమీ లాభం లేదని అవగాహన కలుగుతుంది. అందువల్ల అవసరాలకు మాత్రమే పరిమితమై, ఆత్మ ఉన్నతికి కావలసిన జ్ఞాన సంపాదన మీద ఎక్కువ దృష్టి పెట్టడం ప్రారంభమవుతుంది.

ఈ విషయం అర్థమయ్యే వరకు, రమణ మహర్షి వారి జీవితాన్ని చూసినప్పుడు అందరి లాగే నాకు కూడా అనిపించేది. “ఏమిటి, ఈయన ఇలా గోచితో ఉంటారు? ఆయన తలుచుకుంటే ఎంతమంది ఎంత డబ్బు ఇస్తారు! ఎంత భోగం అనుభవించవచ్చు! అవన్నీ వదిలేసి ఇలా ఎందుకు జీవిస్తున్నారు?” అని అనుకునేవాడిని.

కానీ అందరికీ అర్థమైందో లేదో నాకు తెలియదు, నాకు మాత్రం బాగా అర్థమైంది. రమణ మహర్షి ఎప్పుడూ తాను ఆత్మనే అన్న అవగాహనలో ఉండేవారు, మరణానంతర జీవితం మీద ఆయనకు స్పష్టమైన అవగాహన ఉండేది. అందుకే దేహ పరమైన విషయాల్లో అవసరాలకు మాత్రమే పరిమితమయ్యారు. ఆ పూటకు ఏది దొరికితే అది తినేవారు, ఎక్కడ అవకాశం ఉంటే అక్కడే విశ్రాంతి తీసుకునేవారు. కానీ ఎక్కువగా ఆత్మ కోసం, ఆత్మజ్ఞానం కోసం, ఆత్మోన్నతి కోసం కృషి చేశారు.

నేను పత్రి గారిని ఆదర్శంగా తీసుకున్నాను. పత్రి గారు ఏమన్నారంటే, “సంసారంలోనే నిర్వాణం” అన్నారు. అంటే సంసారం

చేసుకుంటూనే, ఆత్మకు లాభం కలిగించే జీవిత లక్ష్యాన్ని సాధించే మార్గంలో ప్రయాణించాలి అన్నారు.

"సంసారాన్ని వదిలేయాల్సిన అవసరం లేదు, సంసార సుఖాలను కూడా పూర్తిగా వదలాల్సిన అవసరం లేదు. ఉన్నంతలో అనుభవించు, లేకపోతే లేదని బాధపడకు, ఉన్నవారిని చూసి అసూయ పడకు, ఎవరితోనూ పోల్చుకోవద్దు. ఆత్మైన నువ్వు, నువ్వు చేయవలసింది చేస్తున్నావా? లేదా? అన్న దానిపైనే దృష్టి పెట్టు" అని పత్రి గారు చెప్పారు.

ఆయనను ఆదర్శంగా తీసుకొని, అదే విధంగా గత 23 సంవత్సరాలుగా జీవిస్తున్నాను. నేను తెలుసుకున్న సత్యాన్ని, జ్ఞానాన్ని అందరికీ బోధిస్తూ ఉన్నాను. ఎందుచేతనంటే, జీవితంలో నష్టపోయే పనులు చేస్తున్నప్పుడు వెంటనే తెలియక పోవచ్చు. కానీ ఈ శరీరాన్ని వదిలి పైకి వెళ్ళిన తర్వాత, "ఎంత నష్టపోయాం!" అన్నది స్పష్టంగా తెలుస్తుంది.

అందువల్ల మరణానంతర జీవితం మీద అవగాహన ఉన్నవారికి, జీవితంలో ఏ విషయంలో తాము నష్టపోతున్నారో బాగా తెలుస్తుంది. నాకు కూడా అదే తెలిసింది. అందుకే పత్రి గారి పరిచయం అయిన తర్వాత వ్యాపారాలు వదిలేశాను, పదవులు వదిలేశాను, సంసార బాంధవ్యాలకు అతుక్కుపోవడం మానేశాను. పిల్లలు, మనవల మీద ఉండే మమకారాన్ని కూడా తగ్గించుకున్నాను, బాంధవ్యాలలో ఇరుక్కోకుండా జీవించడం ప్రారంభించాను.

ఆ విధంగా ఎంతో సమయాన్ని ఆదా చేసుకోగలిగాను. ఆ సమయాన్ని పూర్తిగా ఆత్మజ్ఞానం మీద, ఆత్మకు లాభం కలిగించే పనుల మీద, సేవా కార్యక్రమాల మీద వినియోగించాను. ఒక సందర్భంలో పత్రి గారు ఇలా చెప్పారు: **"నువ్వు దేని మీద ఎక్కువ దృష్టి పెడతావో, దాంట్లోనే ఛాంపియన్ అవుతావు"** అన్నారు.

అప్పుడు నేను ఆలోచించాను. **"నేను ఆత్మను కాబట్టి, ఆత్మ పరంగా ఛాంపియన్ అవ్వాలి అని నిర్ణయించుకున్నాను".** ఎవరు ఆత్మ పరంగా ఛాంపియన్ అవుతారు? ఆత్మకు లాభించే జ్ఞానాన్ని ఎవరైతే సంపాదించుకుంటారో, వారే ఆత్మ పరంగా, అంటే ఆధ్యాత్మికంగా ఛాంపియన్ అవుతారు, గొప్పవారవుతారు, అందరినీ మించిపోతారు.

అది అర్థం చేసుకున్న తర్వాత, అప్పటి నుంచి నా సమయాన్ని, నా శక్తిని, నా జీవితాన్ని వృథా చేయకుండా పూర్తిగా ఆత్మ కోసం వినియోగించు కున్నాను. ఈ పనులు చేస్తూ ఉంటే, ఒక గొప్ప యోగి చెప్పిన సందేశాన్ని కూడా నేను తెలుసుకోవడం జరిగింది. ఏమిటంటే, **"ఎవరైతే జీవితకాలం జీవించి ఆత్మ గురించి ఏమీ చేయకపోతే, ఆత్మను అసలు పట్టించుకోకపోతే, ఆత్మ అనేది ఒకటి ఉందనే విషయం కూడా తెలియకపోతే, వారిని "ఆత్మ హంతకులు"** అంటారని తెలుసుకున్నాను.

అప్పటి నుంచి నేను ఇంకా బలంగా నిర్ణయించుకున్నాను. నేను ఆత్మ హంతకుడిగా ఉండకూడదు, ఆత్మోన్నతి కలిగించాలి, ఆత్మకు లాభం కలిగించాలి అని నిర్ణయించుకున్నాను. అందుకే దేహ అవసరాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించాను. ఆత్మ పరమైన పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టాను, అలా నా జీవితంలో ఎంతో మార్పు వచ్చింది.

అంతేకాదు, ఆత్మ లాభం కోసం, జ్ఞాన సంపాదన కోసం పత్రి గారు చాలా స్పష్టంగా చెప్పారు. "ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే ముక్తి" అన్నారు. మీ లక్ష్యం మోక్షం, మోక్షం పొందాలంటే జ్ఞానం కావాలి. జ్ఞానం ఎంత పెరుగుతుందో, కర్మలు అంత తగ్గిపోతాయి. పూర్ణ జ్ఞాని అయినప్పుడు కర్మలు పూర్తిగా నశిస్తాయి, అప్పుడు మిగిలేది మోక్షమే.

అటువంటి జ్ఞానాన్ని సంపాదించాలంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచి

ధ్యానం చేయాలి అని చెప్పారు. అప్పుడు నాకు ఒక సందేహం వచ్చింది. "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తే జ్ఞానం ఎలా పెరుగుతుంది? కళ్ళు మూసుకుని కూర్చుంటే జ్ఞానం ఎలా వస్తుంది? అనే ప్రశ్న నన్ను నేను వేసుకున్నాను.

దానిని పరిశీలించినప్పుడు నాకు స్పష్టంగా అర్థమైంది. ఎప్పుడైతే మీరు కళ్ళు మూసుకుని, వచ్చే ఆలోచనలను వదిలి శ్వాస మీద దృష్టి పెడతారో, ఆ ఆలోచనలు క్రమంగా తగ్గిపోతాయి. చివరకు ఆలోచనలు లేని స్థితికి చేరుకుంటారు. ఎప్పుడైతే ఆలోచనలు ఉండవో, అక్కడ మనసు ఉండదు. ఎప్పుడైతే మనసు ఉండదో, అక్కడ ఉండేది ఆత్మ మాత్రమే. అప్పుడు మీరు ఆత్మతో ఉంటారు, ఆత్మ దృష్టిలో ఉంటారు.

ఆత్మతో ఉండడం అంటే సామాన్యమైన విషయం కాదు. "ఆత్మే భగవంతుడు", ఇంకా గట్టిగా చెప్పాలంటే "ఆత్మే పర బ్రహ్మ". పర బ్రహ్మ అంటే ఈ సృష్టిని సృష్టించినవాడు, సృష్టిని నడిపిస్తున్నవాడు. అంత గొప్పవాడైన పరబ్రహ్మతో ధ్యానంలో అనుసంధానం కలుగుతుంది.

ఆయనకు సకల సద్గుణాలు ఉన్నాయి, ఆయనకు లేని శక్తి లేదు, సమస్తం ఆయనే. అలాంటి గొప్ప పర బ్రహ్మతో గంటల తరబడి, రోజుల తరబడి ధ్యాన స్థితిలో ఉండడం వల్ల ఆయన లక్షణాలు ఒక్కొక్కటిగా మీకు సంక్రమించడం ప్రారంభమవుతుంది.

నేను ఇదివరకు కూడా మీకు ఒక ఉదాహరణ చెప్పాను. ఒక ఇనుపముక్కను అయస్కాంతంతో కొంతకాలం ఉంచితే, అయస్కాంత శక్తి ఆ ఇనుపముక్కలోకి సంక్రమిస్తుంది. అలాగే పర బ్రహ్మతో ధ్యాన స్థితిలో ఎక్కువ సమయం ఉండడం వల్ల ఆయనలోని గుణాలు మనలో కూడా ప్రతిఫలించడం ప్రారంభమవుతుంది.

అదే నా జీవితంలో జరిగింది. అందుకే పర బ్రహ్మతో ఎక్కువసేపు

ఉండడానికి, ధ్యానంలో ఎక్కువసేపు గడపడానికి మేము ఒక్కరోజు క్లాసులతో సంతృప్తి చెందలేదు. అందుకే అనేక ప్రాంతాల్లో మూడు రోజుల క్లాసులు నిర్వహిస్తున్నాం.

ఒక్కరోజు క్లాస్ అయితే చాలామంది ఆలస్యంగా వస్తారు, త్వరగా వెళ్తారు, ధ్యానం చేయడానికి తగినంత అవకాశం ఉండదు, దానివల్ల ఆశించిన ప్రయోజనం కనిపించదు. అందుకే భీమవరంతో పాటు కడ్తాల్, కర్ణాటకలోని ధార్వాడ్, బెంగళూరు వైట్ ఫీల్డ్, రాజమండ్రి పేరవరం, నిజామాబాద్, రామగుండం వంటి అనేక ప్రాంతాల్లో మూడు రోజుల క్లాసులు నిర్వహిస్తున్నాం.

నిన్ననే విజయనగరం నుంచి కొంతమంది వచ్చారు. వారితో మాట్లాడినప్పుడు కూడా మూడు రోజుల క్లాసుల వల్ల కలిగే లాభాలను వివరించాను. నిజంగా ధ్యానంలో ఎదగాలన్నా, జ్ఞానం సంపాదించాలన్నా, ఒక్కరోజు క్లాసులు సరిపోవు, మూడు రోజుల సాధన చాలా అవసరం అని వారికి వివరించాను, వారు కూడా అంగీకరించారు. అందుకే విజయనగరంలో కూడా మూడు రోజుల క్లాసులు నిర్వహించడానికి సిద్ధమయ్యారు.

ఇలా అవకాశం ఉన్న ప్రతి చోట మూడు రోజుల క్లాసులు నిర్వహిస్తున్నాము. దీని ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే? సాధకులను ఎక్కువసేపు ధ్యానంలో కూర్చోబెట్టడం. వారితో పాటు మేము కూడా ఎక్కువసేపు ధ్యానం చేయడం.

ఇలాంటి ధ్యానం వల్ల ఎంతటి మార్పు వస్తుందో మా మేడం జీవితాన్ని చూసినా అర్థమవుతుంది. పదిహేను సంవత్సరాల క్రితం ఆమె ఏమనేవారంటే, “ఎక్కడైనా కానీ క్లాస్ చెప్పడం నా వల్ల కాదు. రోజూ సబ్జెక్టులు వెతుక్కోవడం నాకు సాధ్యం కాదు. మీరు చెప్పుకోండి” అని చెప్పేవారు.

కానీ ఇప్పుడు ఆమె స్థాయి పూర్తిగా మారిపోయింది. ఏ అంశం ఇచ్చినా దాని మీద అనర్గళంగా మాట్లాడగలుగుతున్నారు. ఇది ఎలా

సాధ్యమైంది? ధ్యానం వల్లే సాధ్యమైంది. ఖాళీ సమయం దొరికినప్పుడల్లా ఆమె ధ్యానంలో కూర్చొనేవారు, పర బ్రహ్మతో అనుసంధానమై ఉండేవారు, అందువల్ల జ్ఞానం సహజంగానే వికసించింది.

అదే జ్ఞానాన్ని ఇప్పుడు మీ అందరికీ అందిస్తున్నారు. అందుకే నేను భీమవరంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోండి, మీరు నిజంగా కష్టపడితే అద్భుతంగా ఎదుగుతారు అని చెబుతున్నాను.

ఏ రంగంలో కష్టపడితే ఆ రంగంలో ఫలితం వస్తుంది. ధన సంపాదన కోసం కష్టపడితే ధనం పెరుగుతుంది, విద్య కోసం కష్టపడితే విద్య పెరుగుతుంది, జ్ఞానం కోసం కష్టపడితే జ్ఞానం పెరుగుతుంది. ధ్యాన సాధన కోసం కష్టపడితే బుద్ధి వికసిస్తుంది. ఏ విషయంలో కృషి చేస్తే, ఆ విషయంలోనే నిష్ణాతులు అవుతారు.

అందుచేత ముఖ్యంగా మరణానంతర జీవితం మీద అవగాహన పెరిగితే, జీవితంలో ఏ విషయంలో మీరు నష్టపోతున్నారో స్పష్టంగా తెలుస్తుంది. మీరు చేసే పనుల్లో ఏవి వృథా, ఏవి ఉపయోగకరం, ఏవి ఆత్మకు లాభం కలిగించేవో, ఏవి నష్టం కలిగించేవో తెలుసుకుంటారు.

ఈ అవగాహన వచ్చిన తర్వాత వృథా పనులను తగ్గించి, సమయాన్ని, శక్తిని, వాక్కును, ప్రతిభను, మీకు ఉన్న అన్ని వనరులను ఆత్మ లాభం కోసం ఉపయోగించడం ప్రారంభిస్తారు. అదే నేను చేశాను. అందుకే ఈ స్థాయికి రావడం సాధ్యమైంది. ఇప్పుడు నేను చెప్పే అనేక విషయాలు ఎక్కడో చదివినవి కావు, ఎవరి దగ్గర విన్నవి కూడా కావు, సందర్భాన్ని బట్టి సహజంగా వచ్చేవి. మీరు కూడా అలాగే తయారవుతారు.

అందుకే నేను అడుగుతున్నాను. మీ ప్రతిభ ఎంతవరకు పెరిగింది? మీకు సడన్‌గా ఒక అంశం ఇస్తే, దాని మీద ఎంతసేపు మాట్లాడగలుగు తున్నారు? ఎప్పుడైతే మీరు అనర్గళంగా మాట్లాడగలుగుతారో, అప్పుడే మీరు

అపారమైన జ్ఞానాన్ని సంపాదించినట్టే, మీరు ఆత్మకు దగ్గరైనట్టే, ఆత్మ నుంచి జ్ఞానం అందుకుంటున్నట్టే.

గుర్తుపెట్టుకోండి ఆత్మ నుంచి జ్ఞానం అందకపోతే, మీరు సహజంగా మాట్లాడలేరు. అందుకే బుద్ధిని పెంచుకోండి, జ్ఞానాన్ని క్రమంగా పెంచుకోండి, ఆత్మ నుంచి జ్ఞానాన్ని స్వీకరించే ప్రయత్నం చేయండి. “అది ఎలా సాధ్యం?” అని అడుగుతారు, దానికి మనసు యొక్క ప్రాముఖ్యం ఎంత తగ్గిస్తే, ఆత్మకు అంత దగ్గరవుతారు, ఇదే రహస్యం.

మనసు ప్రాధాన్యం తగ్గాలంటే సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి, “శ్వాస మీద ధ్యాస” ఉంచి తీవ్రంగా ధ్యానం చేయాలి. అప్పుడు క్రమంగా ఆత్మతో అనుసంధానం పెరుగుతుంది. మరణానంతర జీవితం మీద అవగాహన కలిగితే, ఇలాంటి సాధన అవకాశాల విలువ మీకు స్పష్టంగా అర్థమవుతుంది.

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| **Telugu Books** | **English Books** | **Hindi Books** | **Kannada Books** | **Tamil Books** |

మరణానంతర జీవితం గురించి అవగాహన ఉంటే **"కుటుంబ సభ్యులు అయిన భార్య, భర్త, పిల్లలు తమ వారు కాదని అర్థమవుతుంది".**

ఎందుకంటే ఈ బంధాలు భూలోకానికి మాత్రమే పరిమితం, పైకి వెళ్లిన తర్వాత ఈ సంబంధాలు ఉండవని గ్రహిస్తారు.

ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నవారికి మమకారం తగ్గుతుంది. వారు కుటుంబ సభ్యులతో ప్రేమగా, బాధ్యతగా ఉంటారు గానీ, వారి కోసం పాపాలు చేయరు, తప్పులు చేయరు, ధర్మ విరుద్ధమైన పనులు చేయరు. తమ ఆత్మను నష్టపరుచుకోరు, బాంధవ్యాలలో చిక్కుకోకుండా జీవించగలుగుతారు.

ఈ అవగాహన ఉన్నవారి జీవితం పూర్తిగా మారిపోతుంది. అంతకుముందు జీవితం ఒకలా ఉంటే, తర్వాత మరోలా మారుతుంది. ఈ విషయాలన్నింటినీ ఆది శంకరాచార్యులవారు కూడా వివిధ సందర్భాల్లో వివరించారు. "ఇదంతా మాయ" అనే విషయాన్ని "జాగ్రత్త వంచకంలో" చెప్పారు. అది అర్థం చేసుకుంటే జీవితం గురించి లోతైన అవగాహన కలుగుతుంది.

అయితే ఈ విషయాలన్నీ మరణించిన తర్వాత మాత్రమే తెలుసు కోవాల్సిన అవసరం లేదు. బుద్ధిని పెంచుకుని, జ్ఞానాన్ని సంపాదించు కుంటే భూమిపైనే ఇవి అర్థమవుతాయి. అందుకే యోగులు, యోగీశ్వరులు, గురువులు ఎప్పుడూ బుద్ధిని పెంచుకోమని, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోమని చెబుతుంటారు.

## మరణానంతరం జరిగేది తెలుసుకుంటే ఇంకా ఏమి తెలుసుకుంటారంటే?

సాధారణంగా చాలామంది "నా భార్య, నా భర్త, నా పిల్లలే నా ప్రపంచం" అని అనుకుంటారు. కానీ మరణానంతర జీవితం గురించి అవగాహన పెరిగినప్పుడు, **"వీరే కాక ఇంకా ఎన్నో జన్మల్లో అనేకమంది భార్యలు, భర్తలు, పిల్లలు ఉన్నారని కూడా అర్థమవుతుంది".** ఈ అవగాహన వల్ల భూమిపై ఉన్న మమకారాలు క్రమంగా తగ్గుతాయి, లేకపోతే ఎంత చెప్పినా అవి తొలగవు.

అందువల్ల ప్రతి ఒక్కరూ మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవాలి. అప్పుడు జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తులు, సంపదలు, వస్తువులు తమతో రావని స్పష్టంగా తెలుస్తుంది. అందుకే వాటికి ఎంతవరకు అవసరమో అంతవరకే ప్రాముఖ్యం ఇస్తారు.

ఇంకొక విషయం కూడా అర్థమవుతుంది, **"శరీర సుఖం, శరీర ఆనందం, శరీర వినోదం కోసం చేసే అధిక ఖర్చులు ఆత్మకు ఎలాంటి లాభం చేకూర్చవు, ఆత్మకు లాభం కలిగించే పనులే మరణానంతరం ఉపయోగ పడతాయి, కానీ శరీరం కోసం చేసిన ఖర్చులు మరణానంతరం ఉపయోగ పడవని తెలుసుకుంటారు".**

అందువల్ల శాశ్వతం కాని వాటికి ప్రాముఖ్యం ఇవ్వకుండా, శాశ్వతమైన వాటికే ప్రాధాన్యం ఇస్తారు. ఈ జీవితం శాశ్వతం కాదని, ఏదో ఒక రోజు ఈ శరీరాన్ని విడిచి వెళ్లాల్సిందేనని స్పష్టంగా అర్థం చేసుకుంటారు.

అలాగే, **"నా అసలైన లోకం పై లోకమే, ఈ భూలోకం నాకు పరలోకం"** అనే అవగాహన కూడా కలుగుతుంది. ఉదాహరణకు, భారతదేశానికి చెందిన వారు ఇతర దేశాలకు వెళ్ళి సంపాదించి, ఆ సంపదను తిరిగి స్వదేశంలో వినియోగిస్తారు. ఎందుకంటే వారికి స్వదేశమే శాశ్వత నివాసం కాబట్టి.

అదేవిధంగా, ఈ భూలోకం కూడా తాత్కాలికమని అర్థమైనప్పుడు, ఇక్కడి కోసం మాత్రమే కాకుండా పర లోకంలో ఉపయోగపడే జ్ఞానం సంపాదించుకుంటారు, ఆత్మ సేవలు చేస్తారు.

మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగిన వారికి **"భూమిపై జీవితం చాలా స్వల్పమని కూడా అర్థమవుతుంది".** అందువల్ల సమయాన్ని, ధనాన్ని, శక్తిని వృథా చేయకుండా సద్వినియోగం చేస్తారు, అవసరాలకు మించి సంపాదించాలనే తపన తగ్గుతుంది.

మరణానంతర జీవితం గురించి అవగాహన వున్నవారు **"చనిపోయిన తర్వాత వారిని తీసుకెళ్లడానికి సహాయకులు వచ్చిన వెంటనే, నిశ్చింతగా వారితో వెళ్ళిపోతారు".** కానీ **"ఈ అవగాహన లేని వారు భూమిపై ఎంతో సంపాదించి, అనేక ఆస్తులు, బంధాలు, మమకారాలు ఏర్పరచుకుని ఉంటారు. చనిపోయిన తర్వాత రమ్మని పిలిచినా, వాటిని వదిలి వెళ్ళలేరు. ఆ మమకారాల వల్ల వెళ్ళకుండా భూమి మీదే ఉండిపోతారు, ఫలితంగా వారు ప్రేతాత్మలుగా అయిపోతారు".**

మరణానంతర జీవితం గురించి అవగాహన పెరిగినప్పుడు, **"భూలోకంలో చేసే కర్మకాండలు ప్రయోజనం లేదని గ్రహిస్తారు".** అందుచేత ఈ భూమిమీద జీవించేటప్పుడే దేనికి ప్రాముఖ్యం ఇవ్వాలో దానికే ప్రాముఖ్యం ఇస్తారు, అప్పుడు వారు వారి జీవితంలో విజయాన్ని సాధిస్తారు.

# ఏదీ బలవంతం కాదు

మరణించిన వారిని ఎవరినైనా పై లోకాలకు తీసుకు వెళ్ళడానికి సహాయకులు వస్తారు. వారు ఏమంటారంటే, **"బాబూ, ఇక్కడ నీ పని పూర్తయింది, అందుకే నువ్వు దేహం నుంచి బయటకు వచ్చావు, ఇక దేహంలో ఉండడానికి వీలు లేదు. నీకు, నీ దేహానికి మధ్య ఉన్న సిల్వర్ కార్డ్ తెగిపోయింది, ఇక నువ్వు ఆ దేహంలోకి ప్రవేశించే అవకాశం లేదు"** అని చెబుతారు.

వారు అలా చెప్పడానికి కారణం కూడా ఉంది. ఎందుకంటే అంతకుముందు అతను ఆ దేహంలోకి మళ్ళీ ప్రవేశించడానికి ప్రయత్నించాడు. కానీ ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఆ దేహంలోకి వెళ్ళలేకపోయాడు. అప్పుడు అతనికి వారు చెప్పింది నిజమేనని అర్థమవుతుంది. అప్పుడు వారు, **"రా వెళ్లిపోదాం, నిన్ను ఏ లోకానికి తీసుకు వెళ్ళాలో ఆ లోకానికి మేము తీసుకెళ్తాము"** అని అంటారు.

కానీ అతను జీవితమంతా భార్యతోనో, భర్తతోనో, పిల్లలతోనో ఎంతో కాలం గడిపాడు, వారితో ఎంతో ఆత్మీయంగా ఉన్నాడు, వారిని ప్రాణప్రదంగా చూసుకున్నాడు. వారు లేకపోతే జీవించలేను అన్నంతగా వారితో అనుబంధాన్ని పెంచుకున్నాడు, అంత దగ్గరగా ఉన్న వారిని వదిలేసి వచ్చేయమంటే ఎలా వస్తాడు?

వారు ఎంత అన్యోన్యంగా ఉండే వారంటే, "నువ్వు లేకపోతే నేను బ్రతకలేను" అని చెప్పుకునేవారు. అలాగే వారి పిల్లలతో కూడా ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా ఉండేవాడు.

ఇంకా పిల్లలే కాదు, మనవలతో కూడా ఎంతో సరదాగా కాలక్షేపం చేస్తూ, వారి మాటలు వింటూ, ముద్దు ముద్దు మాటలకు మురిసిపోతూ, వారు అడిగినవి ఇస్తూ ఎంతో తృప్తి పొందేవాడు. జీవితంలో ఏవైనా సమస్యలు

వచ్చినా, ఉద్యోగంలో లేదా సంపాదనలో చిన్న చిన్న కారణాల వల్ల అశాంతికి గురైనా, మనవలతో కొంతసేపు గడిపినప్పుడు ఎంతో ప్రశాంతతను అనుభఉంచేవాడు, వారితో గడిపేటప్పుడు జరిగిన బాధలన్నీ మర్చిపోయేవాడు.

అటువంటి పరిస్థితిలో ఇప్పుడు ఆ  కుటుంబ సభ్యులను వదిలేసి వచ్చేయమంటే వాడికి అర్థం కాదు. "ఏమిటిది? ఇంత ప్రేమగా ఉన్న వీరందరినీ వదిలేసి ఎలా వెళ్ళగలను?" అని అనుకుంటాడు.

అంతేకాదు, వారి కోసం జీవితంలో ఎంతో సంపాదించాడు, కార్లు కొన్నాడు, ఇంటిని ఎంతో అందంగా అలంకరించుకున్నాడు, అనేక విలువైన వస్తువులను సమకూర్చుకున్నాడు. వాటన్నింటిపై కూడా వాడికి మమకారం పెరిగింది, అందువల్ల వాటిని కూడా వదిలేసి వెళ్లిపోవడం వాడికి చాలా కష్టంగా అనిపిస్తుంది.

ఎన్నో వస్తువులను సమకూర్చుకున్నాడు. ఇప్పుడు  వాటన్నింటినీ వదిలేసి వచ్చేయ మంటున్నారు. ఎంత కష్టపడి ఆ ఇల్లు కట్టుకున్నాడు! జీవితమంతా కష్టపడి సంపాదించిన డబ్బులో ఎక్కువ భాగం ఇంటి EMIలకే సరిపోయింది. అప్పులు కూడా తీరిపోయాయి, ఇక హాయిగా ఆ ఇంట్లో జీవించవచ్చని అనుకున్నాడు, కానీ ఇప్పుడు వీరు వచ్చి ఆ ఇల్లు వదిలేసి రమ్మంటున్నారు.

ఆడవాళ్ళైతే  తమ బంగారాన్ని వదిలి రావాలి, మగ వాళ్ళైతే తాము కొన్న స్థలాలు, అపార్ట్‌మెంట్లు, ఆస్తులు అన్నింటినీ వదిలి రావాలి. ఇలా ఎంతో కష్టపడి సంపాదించుకున్న వాటిని ఎలా వదిలేస్తారు?

అందుకే సహాయకులు రమ్మన్నా కూడా, ఈ బంధాలు మరియు మమకారాలు, సంపదలు ఉండటం వల్ల "నేను రాను" అంటాడు. ఎందుకంటే వాడికి చనిపోయిన తర్వాత ఏమి జరుగుతుందో అనే అవగాహన లేదు.

అప్పుడు ఆ సహాయకులు జాలిపడి కొంత సమయం ఇస్తారు. "పోనీ, మూడు రోజులు అగు, నీకు అన్నీ అర్థమవుతాయి అంటారు. అలా వారం రోజులు, ఆఖరకు పదకొండు రోజులు సమయం కూడా ఇస్తారు. అప్పుడైనా అర్థమవుతుందని ఎదురు చూస్తూ ఉంటారు.

కానీ ఎన్ని రోజులు గడిచినా, కుటుంబ సభ్యుల మీద, ఆస్తుల మీద ఉన్న మమకారాన్ని వదలలేక "నేను రాను" అంటాడు. చివరకు పదకొండో రోజు కార్యక్రమాలు పూర్తయిన తర్వాత, ఆ సహాయకులు ఆఖరిసారిగా హెచ్చరిస్తారు.

**"బాబూ, నీకు చివరిసారిగా చెబుతున్నాం. మేము వెళ్ళిపోయిన తర్వాత నువ్వు చాలా నష్టపోతావు, చాలా బాధపడతావు. మళ్ళీ నిన్ను తీసుకెళ్లడానికి ఎవరూ రారు, ఏం చేయాలో తెలియక ఇక్కడే అల్లాడిపోతావు"** అని ముందుగానే జరగబోయే విషయాన్ని కూడా చెబుతారు. కానీ కుటుంబ సభ్యుల మీద ఉన్న మమకారం వల్ల వారి మాట వినడు, "ఏమైనా సరే, నేను రాను" అని అంటాడు.

సృష్టిలో ఒక ప్రత్యేకమైన ఏర్పాటు ఉంది, సహజంగా అందరికి అది తెలియదు. కానీ ప్రకృతి ఎవ్వరి ఇష్టానికి విరుద్ధంగా, బలవంతంగా ఏ పని చేయబడదు. వారి ఇష్ట ప్రకారమే ప్రతిదీ జరుగుతుంది.

జన్మ తీసుకునేటప్పుడు కూడా ఒక వ్యక్తికి ఇష్టమైతేనే ఆ జన్మ కేటాయించబడుతుంది. జన్మ తీసుకున్న తర్వాత అనుభవించవలసిన కొన్ని కర్మలు ఉంటాయి. ఒక వ్యక్తి ఎన్నో జన్మలు తీసుకుని ఉంటే, ఆ జన్మల్లో చేసిన కర్మలన్నీ ఆకాశిక్ రికార్డ్స్‌లో అతని పేరుమీద నమోదై ఉంటాయి. ఆ రికార్డులను చూపించి, **"బాబూ, నువ్వు చేసిన ఈ కర్మలలో కొన్ని ఈ జన్మలో అనుభవించాలి, వాటిని ఒకసారి చూడు. వీటిలో నువ్వు ఎన్ని అనుభవించాలను**

**కుంటున్నావో నువ్వే ఎంచుకో"** అని చెబుతారు.

ఒక వ్యక్తి 300 జన్మలు తీసుకుని ఉంటే, ఆ 300 జన్మల్లో చేసిన కర్మలలో కొన్ని అనుభవించి ఉంటాడు, మరికొన్ని మిగిలి ఉంటాయి. వాటిలో పాప కర్మలు ఉంటాయి, పుణ్య కర్మలు ఉంటాయి, ఇంకా ఎన్నో రకాల కర్మలు ఉంటాయి. వాటన్నింటినీ చూపించి, "నువ్వే ఎంచుకో" అంటారు. అప్పుడు అతను వాటిని పరిశీలించి, కొన్ని పాప కర్మలను, కొన్ని పుణ్య కర్మలను ఎంచుకుంటాడు.

అంతేకాకుండా అక్కడ ఉన్న మాస్టర్లు కూడా వాడికి సలహాలు ఇస్తారు. ఎందుకంటే అతను పాప కర్మలు ఎందుకు చేశాడు అంటే? పాపం అంటే ఏమిటో తెలియక . అంటే ఎదుటివారిని హింసించడం, జీవులను చంపడం, మోసం చేయడం, ఇతరులకు నష్టం కలిగించడం, బాధ పెట్టడం, ఇబ్బంది పెట్టడం ఇవన్నీ పాప కర్మలే.

ఇవి ఎందుకు చేశాడు? తన లాభం కోసం, తన స్వార్థం కోసం చేశాడు. కానీ తన లాభం కోసం చేసిన పనుల వల్ల ఎదుటివారు ఎంత బాధపడ్డారో! అతనికి తెలియదు. ఉదాహరణకు, ఒకరిపై కోపంతో అతని చేయి నరికాడు అనుకోండి. ఆ వ్యక్తి ఎంత బాధపడతాడో తెలిసి ఉంటే అలా చేసేవాడు కాదు, జ్ఞానం లేకపోవడం వల్లే అలా చేశాడు.

జ్ఞానం ఉన్నవారికి ఒక విషయం బాగా తెలుస్తుంది. **"నాకు అన్యాయం చేసినవారిని శిక్షించడానికి ప్రకృతి ఉంది"** అని. అందుకే జ్ఞాని తనకు ఎవరు ఎంత అన్యాయం చేసినా ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నించడు. వారిని వదిలేస్తాడు, వారిపట్ల జాలి పడతాడు. "పిచ్చివాడా! నువ్వు నాకేదో నష్టం చేశాననుకుంటున్నావు, నువ్వేదో లాభం పొందాను అనుకుంటున్నావు. కానీ చివరికి దాని ఫలితాన్ని నువ్వే అనుభవించాల్సి

వస్తుంది” అని భావించి జాలి పడతాడు.

ఏదైతే అలా ఆకాశిక్ రికార్డ్స్‌లో ఉన్న కర్మలలో కొన్ని కర్మలను వారు ఎంచుకుంటారు. వారు ఎంచుకున్న కర్మలే వారికి కేటాయించ బడతాయి. సహజంగా "ఇది బ్రహ్మ వ్రాసిన వ్రాత" అనుకుంటారు. కానీ వాస్తవానికి బ్రహ్మ వ్రాయలేదు, వారే తాము చేసుకున్న కర్మలలో తాము ఎంచుకున్నవే వ్రాయబడ్డాయి.

అయితే జన్మ తీసుకున్న తర్వాత ఇవన్నీ మరిచిపోతారు. అప్పుడు "నాకు ఎందుకు ఇంత కష్టం వచ్చింది?", "దేవుడు నాకు ఎందుకు అన్యాయం చేశాడు?" అని బాధపడుతూ ఉంటారు.

కానీ వాస్తవానికి ఇక్కడ ఎవరూ ఎవరినీ బాధ పెట్టడం లేదు, ఎవరూ ఎవరికి అన్యాయం చేయడం లేదు. అందువల్ల ఒకడు అన్ని పుణ్య కర్మల్నే ఎంచుకోవాలనుకున్నా కూడా, అక్కడ ఉన్న మాస్టర్ల సలహా మేరకు కొన్ని అనుభవాలను సంపాదించు కోవడానికి పాపకర్మలు కూడా ఎంచుకుంటాడు. ఎందుకంటే ఆ అనుభవాల ద్వారానే అతను నేర్చుకుంటాడు, ప్రవర్తన మార్చుకుంటాడు. లేకపోతే ఎలా ఎదుగుతాడు? నేర్చుకోకపోతే అదే తప్పులను మళ్ళీ మళ్ళీ చేస్తాడు, దాంతో మరిన్ని కర్మలను పెంచుకుంటూ ఉంటాడు.

అందుచేత అక్కడ కౌన్సిలింగ్ చేసేవారు ఏమంటారంటే, **"ఒరేయ్ నాయనా! కొన్ని పుణ్య కర్మలు తీసుకో. కానీ నీ జీవితాన్ని సరి చేసుకోవడానికి కొన్ని అనుభవాలు కూడా అవసరం. నువ్వు చేసిన కొన్ని తప్పులను సరి దిద్దుకోవాలి, ఆ తప్పులను మళ్ళీ చేయకుండా ఉండాలంటే, ఆ తప్పుల వల్ల కలిగే బాధను నువ్వు అనుభవించాలి. అందుకే కొన్ని పాప కర్మలను కూడా ఎంచుకో"** అని సలహా ఇస్తారు.

ఆ పాప కర్మలను ఎంచుకుంటే, ఆ రకమైన బాధలను

అనుభవించాల్సి వస్తుంది. ఒక జన్మలో ఆ బాధను అనుభవించిన తర్వాత, "నేను ఎవరి కాళ్ళు విరగ్గొట్టానో, ఇప్పుడు నా కాళ్ళు కూడా అలానే అయ్యాయి" అని అర్థం చేసుకుంటాడు. ఆ బాధను అనుభవిస్తూ, "ఇక జీవితంలో ఎవరికీ ఇలాంటి హాని చేయకూడదు" అని నిర్ణయించుకుంటాడు.

అలాగే, ఒకరి ఆస్తిని దోచుకున్నా, వారి బంగారాన్ని అపహరించినా, అలాంటి పనుల ఫలితాలను కూడా అనుభవించాల్సి వస్తుంది. అందుకే అవకాశం ఉన్నప్పటికీ, అనుభవాల ద్వారా నేర్చుకోవడానికి కొన్ని పాప కర్మలను కూడా ఎంచుకుంటారు. వాటిని ఎంచుకొని భూమిపై జన్మిస్తారు, కాని ఆ కర్మలను అనుభవిస్తూ, "దేవుడు నాకు ఎందుకు ఇలాంటి పరిస్థితులు కల్పించాడు? ఎందుకు ఇన్ని కష్టాలు పెడుతున్నాడు?" అని అనుకుంటాడు. కానీ అసలు జరిగింది వాడు చేసిన పాపాలలో వాడి ఇష్టంతో ఎంచుకున్నావే! అవన్నీ వాడి ఎంపికలే. అంటే వాడు ఎంచుకున్నవే వాడి నుదుటను వ్రాయబడతాయి. అంతేకాని బలవంతంగా ఎవ్వరూ ఎవరిమీద ఏదీ రుద్దరు.

అందుకే పత్రి గారు **"ఎవరి వాస్తవానికి వారే సృష్టి కర్తలు"** అంటారు.

అంతేకాదు **"ఈ సృష్టిలో ఎవరిమీద ఏది బలవంతంగా రుద్దబడదు అన్నీ వారి ఇష్ట ప్రకారమే జరుపబడతాయి".**

అందుచేత అక్కడ మీకు అవగాహన కలిగించి, వివరించి, మీరు స్వయంగా ఎంచుకునేలా చేస్తారు. మీరు ఎంచుకున్నవే మీకు కేటాయించ బడతాయి. అందుచేత కష్టాలకు ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే జీవితంలో కొన్ని అనుభవాలు పొందడానికి మీరే ఆ కర్మలను ఎంచుకుంటారు, అవి చివరికి మీకు మేలు చేస్తాయి, మీ ప్రవర్తనలో మార్పు తీసుకువస్తాయి అవి ఆత్మ ఎదుగుదలకు ఎంతో ఉపకరిస్తాయి.

ఆత్మ ఎదగాలంటే, జన్మలు తగ్గాలంటే, చివరికి జన్మ లేని స్థితిని

పొందాలంటే తప్పులు చేయకూడదు, పాప కర్మలు చేయకూడదు, అధర్మంగా ప్రవర్తించకూడదు. అయితే ఎందుకు చేస్తున్నారు? ఎందుకంటే వారికి ఆ విషయాల్లో సరైన అనుభవం కలగలేదు కాబట్టి. ఆ అనుభవం పొందడానికే అలాంటి జన్మలను ఎంచుకుంటారు.

అందుకే పత్రి గారు చెబుతారు **"నీకు వచ్చే కష్టాలు, నష్టాలు, అవమానాలు అన్నీ నీ ఆత్మ ఎదుగుదలకు సోపానాలు"** అంటారు. అందువల్ల కష్టాలకు బాధపడాల్సిన పని లేదు, జ్ఞానం ఉన్నవారికి ఈ విషయం అర్థమవుతుంది, అందుకే వారు వాటిని ప్రశాంతంగా అనుభవిస్తారు.

చాలామంది, "నా భర్త వల్ల ఈ బాధలు వస్తున్నాయి", "నా భార్య వల్ల వస్తున్నాయి", "నా తల్లి వల్ల", "నా తండ్రి వల్ల" అని బాధపడుతుంటారు. కానీ "నేను జీవిత పాఠాలు నేర్చుకుంటున్నాను" అనే ఆలోచన ఉండదు. ఆ అవగాహన ఉంటే, వారు పరిస్థితులను వేరే కోణంలో చూస్తారు. చేయకూడని పనులు చేయరు. జ్ఞానం పెరిగే కొద్దీ తప్పులు తగ్గిపోతాయి. అందుచేత ప్రతిదీ మీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది అని తెలుసుకోవాలి.

అలాగే, కొన్ని కర్మలను అనుభవించడానికి స్త్రీ జన్మను కూడా ఎంచుకుంటారు. అది కూడా మీ ఎంపికే. స్త్రీగా జన్మించాలా, పురుషుడిగా జన్మించాలా అనేది మీ నిర్ణయమే. మీరు నేర్చుకోవాల్సిన పాఠాలను దృష్టిలో పెట్టుకుని, అక్కడ ఉన్న మాస్టర్ల సలహా మేరకు మీరు నిర్ణయం తీసుకుంటారు. స్త్రీ జన్మ కావాలనుకుంటే స్త్రీగా, పురుష జన్మ కావాలనుకుంటే పురుషుడిగా జన్మిస్తారు.

ఎందుకంటే స్త్రీ జన్మలో ఎక్కువ పాఠాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. గత కర్మలను అనుభవించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. పురుష జన్మలో ఎక్కువగా కర్మలు చేస్తారు. వాటి ఫలితాలను

అనుభవించడానికి స్త్రీ జన్మను ఎంచుకుంటారు. అంతే తప్ప, "ఆడదానిగా పుట్టడమే నా శాపం", "దేవుడు నాకు ఎందుకు ఇలాంటి జన్మ ఇచ్చాడు?" అని అనుకోవడం సరైనది కాదు.

స్త్రీ జన్మలో అనేక అనుభవాల ద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకుంటారు, కర్మలను దగ్ధం చేసుకుంటారు, తప్పులను సరిదిద్దుకుంటారు. ఆత్మ ఎదుగుదలకు స్త్రీ జన్మ ఎంతో ఉపయోగపడుతుంది.

అందుకే పత్రి గారు చెబుతారు "ఆధ్యాత్మికంగా స్త్రీ జన్మ, పురుష జన్మ కంటే ఒక మెట్టు ముందుంటుంది" అని. చాలామంది స్త్రీలు, "పురుషుడిగా పుట్టి ఉంటే బాగుండేది, అధికారం చూపించేదానిని" అని అనుకుంటారు. కానీ తాము ఎంచుకున్న అనుభవాల కోసమే ఈ జన్మ తీసుకున్నామని వారికి తెలియదు.

అందుచేత ఈ జ్ఞానం తెలుసుకోవాలి. ప్రతిదీ మీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. అలాగే భూమిపై ఎంతకాలం జీవించాలి అనేది కూడా మీ ఎంపికే. ఏమి కావాలి? ఎలా జీవించాలి? ఏ కుటుంబంలో పుట్టాలి? ఏ కులంలో పుట్టాలి? ఏ మతంలో పుట్టాలి? ఏ ప్రాంతంలో పుట్టాలి? ధనవంతుడిగా పుట్టాలా? పేదవాడిగా పుట్టాలా? ఇవన్నీ మీ ఎంపికలే.

మీరు ఎంచుకున్న ప్రకారమే అవి జరుగుతాయి, మీ నిర్ణయానికి విరుద్ధంగా ఏదీ జరగదు. అందుకే ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి **"మీకు వచ్చిన కష్టాలకు, మీ జీవితంలో జరిగిన బాధలకు ఎవరూ కారణం కాదు, మీరే కారణం".** "మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు" ఈ విషయం చాలామందికి అర్థం కాదు. అందుచేత ఈ జ్ఞానం సంపాదించుకోండి, అప్పుడు మీకు అన్నీ స్పష్టంగా తెలుస్తాయి.

అలాగే చనిపోయిన తర్వాత కూడా మీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది.

సహాయకులు వచ్చినప్పుడు "వారితో వెళ్ళాలా? వద్దా? అనేది కూడా మీ నిర్ణయమే, మీకు ఇష్టం లేకపోతే అక్కడే ప్రేతాత్మగా ఉండిపోతారు" తర్వాత అనుభవాల ద్వారా తెలుసుకుని  బాధపడతారు. "అనవసరంగా ఇక్కడే ఉండిపోయాను. అప్పుడే వెళ్ళి ఉంటే బాగుండేది" అని అనుకుంటారు. కానీ అంతకు ముందు ఎలా వెళ్ళాలో, ఎక్కడికి వెళ్ళాలో, ఎవరు తీసుకు వేళ్తారో తెలియక అయోమయంలో పడిపోతారు.

అప్పుడు చాలామందికి సందేహం వస్తుంది  "మరి వారు ఎప్పుడు వెళ్తారు?" అని. వారిలో అంతులేని అంతర్మథనం జరుగుతుంది. కొన్ని వందల సంవత్సరాలు, కొన్నిసార్లు వేల సంవత్సరాలు కూడా ప్రేతాత్మ స్థితిలో గడిచిపోతాయి. చెట్లు, ప్రదేశాలు, ఇళ్లు చుట్టూ తిరుగుతూ ఏం చేయాలో తెలియక అల్లాడుతుంటారు.

చివరకు, "ఇక నాకు ఇక్కడ ఉండాలని లేదు" అనే బలమైన నిర్ణయం వారిలో కలిగినప్పుడు, ఎవరో ఒకరు వచ్చి వారిని తీసుకెళ్తారు. వారు వెళ్ళవలసిన లోకాలకు చేరుస్తారు. కానీ అప్పటివరకు ఎన్నో వందల సంవత్సరాలు, కొన్నిసార్లు వేల సంవత్సరాలు కూడా వృథా అయిపోతాయి. వెంటనే వెళ్ళిపోయి ఉంటే, కొన్ని జన్మలలో కొత్త పాఠాలు నేర్చుకుని ఉందురు. తర్వాత తమ తప్పు అర్థమవుతుంది. ఈ అనుభవాల వల్ల క్రమంగా మమకారాలు తగ్గిపోతాయి. "ఇవన్నీ తాత్కాలికమే" అనే జ్ఞానం పెరుగుతుంది.

అందుకే జ్ఞానం పెంచుకోవాలని, జ్ఞానం సంపాదించుకోవాలని మహనీయులు చెబుతుంటారు. జ్ఞానం పెరిగినవారు తప్పులు చేయరు, చేయవలసిన పనులను మాత్రమే చేస్తారు, చాలా వేగంగా ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. వారికి అవకాశం ఉన్నా కూడా కేవలం భోగాలను అనుభవించే జన్మలను ఎంచుకోరు, పాఠాలు నేర్చుకునే జన్మలను ఎక్కువగా ఎంచుకుంటారు.

కొంతమంది మహనీయులు  కఠినమైన పరిస్థితులను స్వయంగా ఎంచుకుంటారు. ఓపిక, సహనం, క్షమ, వివేకం పెంచుకోవడానికి అలాంటి అనుభవాలను స్వీకరిస్తారు.

స్త్రీగా జన్మించి కఠిన స్వభావం ఉన్న భర్తను ఎంచుకోవడం, పురుషుడిగా జన్మించి స్త్రీనుంచి కఠిన పరిస్థితులను ఎదుర్కోవడం ఇవన్నీ కూడా కొన్ని సందర్భాల్లో ఆత్మ ఎదుగుదల కోసం ఎంచుకున్న జన్మలు.  భూమి పైకి వచ్చిన తర్వాత ఇవన్నీ మరిచిపోయి  బాధపడుతుంటారు.

కానీ జ్ఞానం ఉంటే, “ఇది కూడా నా ఎంపికలో భాగమే” అని అర్థం చేసుకుంటారు. అందుచేత మరణానంతర జీవితం గురించి ఎంత అవగాహన ఉంటే, అంత ఎక్కువ పాఠాలు నేర్చుకుంటారు, తమ ప్రవర్తనను మార్చుకుంటారు, జన్మలను తగ్గించుకుంటారు. చివరకు తమ లక్ష్యానికి మరింత దగ్గరవుతారు, ఇదంతా చెప్పడానికి కారణం ఇదే.

# దేహం కోసం చేసే ఖర్చులన్నీ వృథా

సహజంగా లోకంలో ఎవరిని చూసినా, జీవించి ఉన్నప్పుడు ఉండే జీవితం గురించే తెలుసుకుంటున్నారు. వారు దేహం గురించి, మనసు గురించి, బుద్ధి గురించి ఎక్కువగా తెలుసుకుంటారు. కారణం చాలామంది మాస్టర్లు దేహలాభాలు, మనోలాభాలు గురించి ఎక్కువగా మాట్లాడుతారు. అంటే ఆరోగ్యం గురించి, సుఖసంతోషాల గురించి, డబ్బు ఎలా సంపాదించాలి అనే విషయాల గురించి చెబుతూ ఉంటారు.

అలాగే మనోలాభాలు అంటే మనుషులకు ఎన్నో కోరికలు ఉంటాయి, రకరకాల కోరికలు ఉంటాయి. డబ్బు సంపాదించాలని, తమకు లేదా తమ కుటుంబ సభ్యులకు ఉన్న సమస్యలు తొలగిపోవాలని, కష్టాల నుంచి బయటపడాలని కోరుకుంటారు. అందువల్ల ఆ కోరికలు తీరాలంటే ఏమి చేయాలని మాస్టర్లను అడుగుతారు.

అప్పుడు ఆ మాస్టర్లు, "ఏమీ లేదమ్మా, మీరు ఒక సంకల్పం పెట్టుకోండి, అది నెరవేరుతుంది" అని చెబుతారు. అప్పుడు వారు సంకల్పం పెట్టుకుని ధ్యానం చేస్తారు. ఇలా కొంతమంది మాస్టర్లు మనోలాభాల మీద ఎక్కువ దృష్టి పెడతారు.

మరికొంతమంది బుద్ధి స్థాయిలో ఎదిగిన మాస్టర్లు పుస్తకాలు బాగా చదవండి, జ్ఞానాన్ని పెంచుకోండి అని చెబుతూ ఉంటారు. కానీ ఆత్మ గురించి, ఆత్మ ఉన్నతి గురించి చెప్పేవారు మాత్రం చాలా తక్కువగా ఉంటారు.

ఎందుకంటే ఆత్మ అనేది ఈ భూమ్మీద శాశ్వతంగా ఉండదు, కొంతకాలం తర్వాత శరీరాన్ని వదిలేస్తుంది. శరీరాన్ని వదిలిన తర్వాత ఆ శరీరాన్ని దహనం చేస్తారు, కానీ ఆత్మ ఒక్కటే పై లోకాలకు వెళ్తుంది. భూమ్మీద సంపాదించిన జ్ఞానాన్ని బట్టి అక్కడ ఉన్నత లోకాలలో స్థానం పొందుతుంది.

కొంతకాలం అక్కడ ఉండి, ఇంకా ఉన్నత లోకాలకు చేరుకోవడానికి మళ్ళీ ఒక దేహాన్ని ఎంచుకుని భూమ్మీదకు వస్తుంది.

అలా ఎవరైతే మరణించిన తర్వాత జరిగే విషయాలను తెలుసు కుంటూ ఉంటారో, వారికి ఒక గొప్ప సత్యం అర్థమవుతుంది. ఏమిటంటే? **"వారు భూమ్మీద ఎంత సంపాదించినా, చనిపోయేటప్పుడు వాటిలో ఒక్కటి కూడా వెంట రాదు. సంపదలు, ఆస్తులు, ధనం ఏవీ రావు". ఆఖరికి ఒక వ్యక్తి చనిపోయి పై లోకాలకు వెళ్లినప్పుడు, అతని భార్య రాదు, పిల్లలు రారు, బంధువులు రారు, స్నేహితులు రారు. జీవించి ఉన్నంతకాలం వాళ్లే ప్రాణం అన్నట్లుగా కనిపించినా, ఆ ప్రయాణంలో ఒక్కరు కూడా తోడు రారు".**

ఈ విషయాన్ని పురాణాల్లో కూడా చెబుతారు. ఒక వ్యక్తి చనిపోయాడట, చనిపోయిన తర్వాత పైనుంచి ఇద్దరు సహాయకులు వస్తారు. వారు అతన్ని చెరో వైపు పట్టుకుని, అతను వెళ్లవలసిన లోకానికి తీసుకెళ్తూ ఉంటారు. అలా తీసుకెళ్తూ ఉండగా అతను, "అయ్యా, ఒక్కసారి ఆగండి" అని అడిగాడు. అప్పుడు వారు, "నాయనా, ఇక్కడ ఆగడానికి ఏమి ఉండదు, మా పని నిన్ను తీసుకెళ్ళడమే" అని చెప్పారు.

అయినా అతను మళ్ళీ  మళ్ళీ వేడుకోవడంతో, వారు కాసేపు ఆగారు. వెంటనే అతను వెనక్కి తిరిగి చూశాడు. చూసిన తర్వాత, "సరే, ఇప్పుడు నడవండి" అన్నాడు. అది చూసి ఆ సహాయకులకు ఆశ్చర్యం వేసింది. "నువ్వు ఎందుకు ఆగమన్నావు? ఎందుకు వెనక్కి తిరిగి చూశావు? ఇప్పుడు ఎందుకు మళ్ళీ నడవమంటున్నావు?" అని అడిగారు. అప్పుడు అతను ఇలా చెప్పాడు "నా జీవితంలో నాకు ఎంతో మంది ఉన్నారు. వారి కోసం నేను ఎన్నో పనులు చేశాను, వారికి సహాయం చేశాను, సేవలు చేశాను.

అందుకే వారిలో ఎవరైనా నా కోసం వస్తున్నారా? అని ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను. కానీ ఒక్కరు కూడా నా వెంట రావడం లేదు, ఇప్పుడు

నాకు అర్థమైంది. **"వాళ్ళ కోసం నేను ఎన్నో తప్పులు చేశాను, పాపాలు చేశాను, అధర్మంగా సంపాదించాను, కానీ వారు మాత్రం నా వెంట రావడం లేదు. అయితే వారి కోసం చేసిన పాపాలు, అధర్మంగా చేసిన పనుల ఫలితాలు మాత్రం నాతో పాటు వస్తున్నాయి. నేను ఎంత తెలివితక్కువ పని చేశానో ఇప్పుడు అర్థమవుతోంది"** అని చెప్పాడు.

దీనిని బట్టి మీరు ఒక విషయం అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, ఎవరైతే మరణించిన తర్వాత జరిగేది తెలుసుకుంటారో వారికి ఇంకొక గొప్ప సత్యం కూడా బాగా అర్థమవుతుంది. ఏమిటంటే, **"దేహం కోసం చేసే ఖర్చులన్నీ వృథా అని తెలుసుకుంటాడు, కానీ ఆత్మ కోసం, ఆత్మ లాభం కోసం చేసే ఖర్చులన్నీ తనకు లాభిస్తాయని, తనతో పాటు వస్తాయని అర్థం చేసుకుంటాడు".** దేహం కోసం ఎంత ఖర్చు పెట్టినా అవన్నీ భూమి వరకే పరిమితమవుతాయని స్పష్టంగా గ్రహిస్తాడు.

మీరు గమనించండి, ఆత్మజ్ఞానం లేని వారు, ఆత్మ గురించి తెలియని వారు దేహం కోసమే జీవిస్తారు, దేహ సంబంధమైన ఖర్చులే చేస్తారు. సుఖాలు, భోగాలు, సరదాలు, వినోదాలు, విందులు ఇవే ముఖ్యమని భావిస్తారు, అంతకంటే జీవితంలో ఇంకేమీ లేదని అనుకుంటారు. కానీ ఎవరైతే మరణానంతర జీవితం గురించి తెలుసుకుంటారో వారు వీటికి అంత ప్రాముఖ్యం ఇవ్వరు.

నా వరకు వస్తే, పత్రి గారు పరిచయం అయినప్పటి నుంచి మన సొసైటీలో చాలామంది ఏం చేస్తున్నారో నేను గమనించాను. పేరుకు ధ్యాన యాత్ర అంటారు, కానీ చాలా వరకు అవి వినోద యాత్రలుగానే ఉంటాయి, వాటి కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

కానీ నా వరకు ఆలోచించుకుంటే, అది సరదా కోసం చేసే ఖర్చే తప్ప ఆత్మకు లాభించేది కాదు. దేహానికి కొంత సంతోషం కలిగించవచ్చు

కానీ ఆత్మాభివృద్ధికి ఉపయోగపడదు.

అలాగే అవసరం లేని బట్టలు కొనడం, అనవసర ఖర్చులు చేయడం, ప్రదర్శన కోసం డబ్బు వెచ్చించడం వంటివి ఆత్మకు ఎలాంటి ప్రయోజనం ఇవ్వవు. అదే మీరు ఆత్మకు లాభించే పనుల కోసం ఖర్చు చేస్తే, అది తప్పకుండా మీకు మేలు చేస్తుంది. ఎంతో కొంత ఉన్నత లోకాలకు చేరుకునే అర్హతను పెంచుతుంది.

ఇంకో విషయం మీరు జనాలోకానికి క్రింద ఉన్న లోకాలను చేరుకోవడం కాదు. జనా లోకాన్ని దాటి ఉన్న మహాలోకం, తపోలోకం వంటి ఉన్నత లోకాలను చేరుకోవాలి. చివరికి సత్యలోకాన్ని చేరుకోవడమే లక్ష్యంగా ఉండాలి. ఎందుకంటే ఆ లోకాలను చేరుకున్నవారు పైకి వెళ్లిన తర్వాత మాస్టర్లుగా తయారవుతారు. వారు ఎంతో జ్ఞానం సంపాదించి, ఆధ్యాత్మికంగా ఎంతో ఎదిగినవారు. అలాంటి వారికే కింది లోకాలలో ఉన్న ఆత్మలకు కౌన్సిలింగ్ చేసే బాధ్యత అప్పగించబడుతుంది. వారు క్రింది లోకాలలో ఉన్నవారికి బోధిస్తారు, కౌన్సిలింగ్ చేస్తారు, వారికి మార్గం చూపిస్తారు. అందుకే నేర్చుకునేవారు కింది లోకాలలో ఉంటారు, నేర్పేవారు పై లోకాలలో ఉంటారు.

పత్రి గారు "ఈ ధ్యానం, ఈ జ్ఞానం అందరికీ చెప్పండి" అని ప్రోత్సహించారు. మొదట్లో నేను ఆశ్చర్యపోయాను, "ఇప్పుడే ధ్యానంలోకి వచ్చాం, నాకు ఇంకా ఏమి తెలుసు? నేను ఎలా చెప్పగలను?" అని అనిపించింది.

మొదటిసారి భీమవరంలో ఆయనతో కారులో ప్రయాణిస్తున్నప్పుడు, "నువ్వు కూడా క్లాసులు చెప్పాలి" అన్నారు. అప్పుడు నేను, "సార్, మీలాగా ఎదిగి, ఇంకా ఎక్కువ జ్ఞానం సంపాదించిన తర్వాత చెబుతాను" అన్నాను. దానికి ఆయన చాలా సరళంగా, "సరే, నీ ఇష్ట ప్రకారమే చేయి" అన్నారు. అవునని అనలేదు, కాదని అనలేదు.

ఆ తర్వాత నాకు అంతర్మథనం మొదలైంది. "ఇంత గొప్ప

గురువుగారు నువ్వు  చెప్పు అంటుంటే, నేను ఇలా ఎందుకు అన్నాను?" అని నాలో నేను ఆలోచించుకున్నాను. కొంతసేపటి తర్వాత మళ్ళీ ఆయనతో, "సరే సార్, మీరు చెప్పినట్టే చేస్తాను" అన్నాను. అప్పుడు ఆయన ప్రత్యేకంగా ఏమీ మాట్లాడలేదు. తర్వాత నాకు ఒక గొప్ప విషయం అర్థమైంది, ఏమిటంటే? **"పంచింది పెంచబడుతుంది"** అని.

మన వద్ద ఉన్న జ్ఞానాన్ని పంచినప్పుడే అది మరింత పెరుగుతుంది, దాచుకుంటే దోచుకోబడుతుంది. తర్వాత ఆయన ఇంకో గొప్ప విషయం చెప్పారు. **"నువ్వు ఎంత నేర్చుకుంటే అంతే చెప్పు, గొప్పలు చెప్పుకోకు, కల్పించి చెప్పకు, అసత్యాలు చెప్పకు అని కూడా చెప్పారు".**

అప్పుడు నాకు ఒక విషయం అర్థమైంది. "పంచింది పెంచ బడుతుంది" అంటే జ్ఞానాన్ని పంచడం వల్ల  నా జ్ఞానం ఇంకా పెరుగుతుందన్న మాట. జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇది ఒక గొప్ప, తేలికైన మార్గమని అర్థమైంది. అప్పటి నుంచి ఇంచుమించు 24 సంవత్సరాలు నుంచి ఇప్పటివరకు నాన్‌స్టాప్‌గా అలా తిరుగుతూనే ఉన్నాము. ఏదో ఒక ఊరు, ఏదో ఒక జిల్లా, ఏదో ఒక రాష్ట్రం అంటూ ప్రయాణిస్తూ, మేము నేర్చుకున్నదంతా అందరికీ పంచుతూనే ఉన్నాం.

తరువాత ఇంకో విషయం తెలుసుకున్నాను "భాధ గురువు తనకు తెలిసిన విషయాలను పూర్తిగా చెప్పడానికి ఇష్టపడదు, కొన్నింటిని దాచు కుంటాడు. చెబితే ఎదుటి వాడు కూడా గొప్పవాడవుతాడని భావిస్తాడు. కానీ సద్గురువు మాత్రం పంచితే ఇంకా పెరుగుతుందని తెలుసుకుంటాడు. అందుకే తనకు తెలిసిన దంతా అందరికీ చెబుతాడు. ఏదీ దాచుకోడు" అని తెలిసింది.

అందుకే పత్రి గారు ఎప్పుడూ, **"మీకు లభించిన జ్ఞానాన్ని పుస్తక రూపంలో ప్రచురించండి. అది అందరికీ అందేలా చేయండి"** అని చెప్పేవారు. ఆ పనే మేము ఇద్దరం చేస్తున్నాం. ఎందుకంటే ఒకచోట క్లాస్ చెబితే 50

మందికి, 100 మందికి, 200 మందికి మాత్రమే చెప్పగలం. కానీ ఒక పుస్తకం ప్రచురితమైతే వేల మందికి చేరుతుంది. అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులు కూడా చదువుతారు. అలా ఎంతో మందికి ఆ జ్ఞానం చేరుతుంది.

అందుకే పుస్తకం చాలా ముఖ్యమని నేను అర్థం చేసుకున్నాను. నాకు గానీ, మేడమ్‌కి గానీ ఏ జ్ఞానం లభించినా, దానిని పుస్తక రూపంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటాం.

పత్రి గారు కూడా, "నువ్వు పొందిన అనుభవాలను గ్రంథస్థం చేసి అందరికీ పంచు" అని చెప్పేవారు. ఆయన చెప్పిన విషయాలలో చాలా వాటిని మేము ఆచరిస్తున్నాం. ఒక సందర్భంలో పత్రి గారు ఇలా అన్నారు: **"నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశానయ్యా, వీరు కొత్త విషయాలు కావాలంటున్నారు."** అని అన్నారు. అప్పుడు నాకు అర్థమైంది, నిజమైన సద్గురువు ఏదీ దాచుకోడు, తనకు తెలిసిన దంతా అందరికీ అందిస్తాడు.

అప్పటి నుంచి నేను కూడా నాకు తెలిసినది ఏదైనా సరే దాచు కోకుండా చెప్పడానికి ప్రయత్నిస్తున్నాను. మాకు లభించిన మరో గొప్ప అవకాశం ఈ జూమ్ వేదిక. జూమ్ వల్ల మాకు అందిన జ్ఞానాన్ని వెంటనే మీతో పంచుకునే అవకాశం లభిస్తోంది, ఇది నిజంగా ఒక గొప్ప వరం.

అందుకే నేను మీకు కూడా  తెలిసింది చెప్పండి, దాచుకోకండి, భయపడకండి, సిగ్గుపడకండి. మీరు ఇస్తూ ఉంటే, ప్రకృతి మీకు మరింత ఇస్తూనే ఉంటుంది, అలా మీరు గొప్పగా ఎదుగుతారు. అందువల్ల జ్ఞానాన్ని పెంచుకోవాలంటే, మీకు ఉన్న దాన్ని పంచుతూ ఉండాలి. అలాగే నిరంతరం కొత్త జ్ఞానాన్ని సంపాదిస్తూ ఉండాలి, క్లాసులు వింటూ సంపాదించుకోవాలి, పుస్తకాలు చదువుతూ సంపాదించుకోవాలి. జ్ఞానవంతుల వీడియోలు చూస్తూ సంపాదించుకోవాలి, సంపాదించిన దానిని వెంటనే పంచాలి. "తర్వాత

చెబుతాను" అని వాయిదా వేస్తే అది క్రమంగా మరచిపోతారు, తెలుసుకున్న వెంటనే దాన్ని చెప్పాలి, అలా ఇస్తూ ఉంటే ప్రకృతి సహకరిస్తుంది.

ఈ విషయాన్ని కూడా నేను పత్రి గారి నుంచే నేర్చుకున్నాను. పత్రిగారికి ఎవరు ఏది ఇచ్చినా, వెంటనే అందరికీ పంచేవారు, ఆయన తన కోసం దాచుకునేవారు కాదు. ఎవరో పుట్టిన రోజున ఒక చాక్లెట్ ప్యాకెట్ తీసుకొచ్చినా, ఆయన ఒక్కటి మాత్రమే తీసుకుని మిగిలినవన్నీ అక్కడున్న వారికి పంచేవారు. ఆయనకు ఎన్నో దుస్తులు బహుమతిగా వచ్చేవి, వాటిని కూడా ఇతరులకు ఇచ్చేవారు.

ఆయన దగ్గర ఏమీ ఉంచుకునేవాడు కాదు. కానీ ఆశ్చర్యకరంగా ఆయన ఎంత ఇస్తే అంత వస్తూనే ఉండేది. అదే **"పంచింది పెంచబడుతుంది"** అనే ప్రకృతి నియమం. ప్రకృతిలో ఒక గొప్ప ఏర్పాటు ఉంది, **"మీరు చేసే మంచి పనికి అవసరమైన సహకారం ఏదో ఒక రూపంలో లభిస్తుంది".**

చాలామంది, "నేను చేయగలనో లేదో", "డబ్బు వస్తుందో రాదో", "సహాయం దొరుకుతుందో లేదో" అని భయపడుతూ ఉంటారు. ఆ భయంతో ముందుకు అడుగు వేయరు, ఫలితంగా ఉన్నచోటే ఉండిపోతారు. కానీ మీరు ధైర్యంగా ఒక మంచి పనిని ప్రారంభిస్తే, ప్రకృతి తప్పకుండా సహకరిస్తుంది. మీ కార్యక్రమం విజయవంతం కావడానికి అవసరమైన సహాయం ఏదో ఒక చోట నుంచి వస్తుంది, ఎవరో ఒకరు ముందుకు వచ్చి సహకరిస్తారు, అలా మీరు గొప్పగా ఎదగగలుగుతారు.

అందుకే నేను మళ్ళీ చెబుతున్నాను. మరణానంతరం జరిగే విషయాలను మీరు లోతుగా అర్థం చేసుకున్నప్పుడు, **"దేహం కోసం చేసే చాలా ఖర్చులు వృథా అని గ్రహిస్తారు, అందువల్ల దేహ సంబంధమైన అనవసర ఖర్చులను తగ్గించుకోండి. అదే సమయంలో ఆత్మ లాభానికి, జ్ఞాన సంపాదనకు, ధ్యాన ప్రచారానికి, సేవా కార్యక్రమాలకు అవసరమైన ఖర్చులను ఉదారంగా**

**చేయండి".**

ఒక రకంగా చెప్పాలంటే, మా ఇద్దరం దేహ సంబంధమైన ఖర్చులను దాదాపు పూర్తిగా తగ్గించుకున్నాం. ఆత్మ లాభానికి సంబంధించిన ఖర్చులను మాత్రం పెంచుకున్నాం, దాని వల్ల మా జీవితంలో ఎంతో మార్పు వచ్చింది.

గతంలో పండుగలు వస్తే పిల్లలకు, బంధువులకు బహుమతులు కొనడం, చిన్న చిన్న కార్యక్రమాలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం చేసేవారం. ఇప్పుడు అలాంటివి చాలా వరకు తగ్గిపోయాయి, మా పిల్లలు వచ్చినా, పండుగలు వచ్చినా, గతంలో లాగా బహుమతులు ఇవ్వడం లేదు. ఎందుకంటే వారికి అవసరమైనంత ఉంది. మనం ఇచ్చే చిన్న బహుమతికంటే, ఆ డబ్బుతో పది మందికి ఉపయోగపడే పని చేయడం మంచిదని భావించి అదే చేస్తున్నాం. ఎంత ఎక్కువగా సేవా కార్యక్రమాలకు, జ్ఞాన ప్రచారానికి ఖర్చు చేస్తున్నామో, అంత ఎక్కువగా ఆత్మ సంతృప్తి మరియు ఆధ్యాత్మిక ఎదుగుదల కూడా అనుభవిస్తున్నాం.

కాబట్టి ఈ విషయం మీకు అర్థమైతే దేహం కోసం చేసే అనవసర ఖర్చులు వృథా, ఆత్మ కోసం చేసే ఖర్చులు లాభదాయకం అని గ్రహిస్తే మీ జీవితంలో కూడా గొప్ప మార్పు వస్తుంది. ఎందుకంటే ఇక్కడ ఏదీ శాశ్వతం కాదు, శాశ్వతమైనది ఆత్మ మాత్రమే. ఆ ఆత్మ ఉన్నతికి ఉపయోగపడేదే నిజమైన సంపద.

ఎవరికైనా జన్మ చక్రంలో ప్రవేశించిన వెంటనే కర్మ చక్రంలో కూడా ప్రవేశిస్తారు. అంటే కర్మలు ఉన్నంతకాలం జన్మలు ఉంటాయి, లక్ష్యాన్ని చేరుకునే వరకు జన్మలు కొనసాగుతూనే ఉంటాయి. ఇలా ఈ జీవిత ప్రయాణం సాగుతూ ఉంటుంది.

విచిత్రం ఏమిటంటే? పూర్ణాత్మ మీకు నిర్దేశించిన లక్ష్యం గురించి మీకు అవగాహన ఉండదు. ఎందుకంటే అంశాత్మను ఒక మానవ శరీరంలో

ప్రవేశపెట్టే ముందు, మనసు అనే మాయను కూడా దానితో పాటు ప్రవేశపెడతారు. మొదట అంశాత్మ మనసనే మాయలో ప్రవేశిస్తుంది, ఆ తర్వాత ఆ రెండూ కలిసి మానవ శరీరంలో ప్రవేశిస్తాయి.

ఎప్పుడైతే ఈ మనసనే మాయలో ప్రవేశిస్తారో, అప్పుడే ఆత్మ తాను ఆత్మను అన్న విషయాన్ని మరిచిపోతుంది, మనసు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ మనసు ఏం చేస్తుందంటే, అసలు "నేను" అనే ఆత్మను ప్రక్కనపెట్టి, తానే "నేను" అన్నట్లుగా మనసు వ్యవహరిస్తుంది. ఆత్మ అసలు లేనట్టుగానే ప్రవర్తిస్తుంది.

ఫలితంగా అసలు "నేను" అనే దృష్టే ఉండదు. కాని అసలు "నేను" దృష్టిలోకి వచ్చినట్లయితే అసలు లక్ష్యం ఏమిటో తెలుస్తుంది. కానీ అసలు "నేను"ను ప్రక్కనపెట్టి, కొసరు "నేను" అయిన మనసు ఉన్నంతకాలం దాని లక్ష్యాలే ఎక్కువగా ఉంటాయి, కొసరు "నేను"కు ఎన్నో లక్ష్యాలు ఉంటాయి.

ఒక జన్మలో మీరు సంగీత విద్వాంసుడు కావాలనే లక్ష్యం పెట్టుకోవచ్చు, ఆ జన్మంతా సంగీతంలో ప్రావీణ్యం సంపాదించడానికి, అవార్డులు పొందడానికి, గుర్తింపు తెచ్చుకోవడానికి కృషి చేస్తారు. మరో జన్మలో క్రికెట్ ఛాంపియన్ కావాలనే లక్ష్యం ఉంటుంది. జీవితమంతా అదే సాధన చేస్తూ, ఇతరులను అధిగమించి గొప్ప ఛాంపియన్ కావాలని ప్రయత్నిస్తారు. మరో జన్మలో చెస్‌లో ప్రపంచ రికార్డు సాధించాలనుకుంటారు. ఇంకొక జన్మలో సినిమా నటుడు కావాలనుకుంటారు. ఆ రంగంలో ప్రవేశించి, అవకాశాల కోసం శ్రమించి, అందరినీ మించి పేరు సంపాదించాలని ప్రయత్నిస్తారు.

కొంతమంది రాజకీయ రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటారు. వార్డు కౌన్సిలర్ అయితే సరిపోదు, చైర్మన్ కావాలి. అక్కడితో ఆగరు, ఎమ్మెల్యే కావాలి. తర్వాత మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, చివరకు ప్రధానమంత్రి కావాలని ఆశిస్తారు. జీవితమంతా ఆ లక్ష్యాలకే

అంకితం చేస్తారు. కానీ "నేను ఆత్మను", "నా అసలు లక్ష్యం పూర్ణాత్మ కావడం" అన్న విషయం వారికి తెలియదు. ఈ మనసు అనే కొసరు "నేను" ఉన్నంతకాలం ఆత్మ ప్రభావం బయటపడనివ్వదు. దీనికి కోరికలు వేరే, సరదాలు వేరే, సుఖాలు వేరే. అందువల్ల ఇది ఎప్పుడూ అసలు "నేను" గురించి ఆలోచించదు.

ఇలా సుమారు 300 నుంచి 350 జన్మలు గడిచిపోతాయి. ఎన్నో రకాల లక్ష్యాలు సాధిస్తూ, అనుభవాలు పొందుతూ జీవితం సాగుతుంది. 350 జన్మలు దాటిన తర్వాత అసలైన ఆధ్యాత్మిక మార్గంలోకి, అంటే ఆత్మ మార్గంలోకి ప్రవేశిస్తారు. అప్పుడు "నేను ఆత్మను" అన్న అవగాహన కలుగుతుంది. అప్పటివరకు "నేను ఈ దేహమే" అనే భావంలో ఉంటారు. "నేను మానవుడిని", "నేను ఈ కులానికి చెందినవాడిని", "నేను ఈ మతానికి చెందినవాడిని", "నేను ఈ ప్రాంతానికి చెందినవాడిని", "నేను ఈ రాష్ట్రానికి చెందినవాడిని" అని భావిస్తారు. మిగతా వారిని పరాయి వారిగా చూస్తారు.

అయితే ఎన్నో జన్మల అనుభవాల తర్వాత మనసు ప్రభావం క్రమంగా తగ్గుతుంది, జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురవుతాయి. అప్పుడు "ఈ కష్టాల నుంచి ఎలా బయటపడాలి?" అనే ఆలోచనతో ఒక సద్గురువును ఆశ్రయించి ఆ సద్గురువు ద్వారా ఆధ్యాత్మిక మార్గంలోకి ప్రవేశిస్తారు. ఈ మార్గంలోకి వచ్చిన తర్వాత మెల్లగా "దేహం నేను కాదు, మనసు నేను కాదు, నేను ఆత్మను" అన్న సత్యం అర్థమవుతుంది. సద్గురువు అదే బోధిస్తారు. అప్పుడు మీలో ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. "నేను ఎవరు?", "ఎక్కడి నుంచి వచ్చాను?", "పుట్టుక ఎందుకు?", "మరణం తర్వాత ఏమవుతుంది?", "నా జీవిత లక్ష్యం ఏమిటి?", "నేను సాధించవలసింది ఏమిటి?" వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుంది.

సద్గురువు ద్వారా ఒక్కొక్కటిగా నేర్చుకుంటూ వెళ్తారు. నేర్చుకునే

కొద్దీ కొత్త కొత్త విషయాలు తెలుస్తాయి. అప్పటివరకు ఈ ప్రపంచ జీవితం గురించే తెలుసు, కానీ మరణం తర్వాత ఏమవుతుందో తెలియదు. సద్గురువు లభించిన తర్వాత అది కూడా తెలుస్తుంది, అప్పుడు అర్థమవుతుంది "ఇప్పుడు కనిపిస్తున్నది మాత్రమే జీవితం కాదు. మరణం తర్వాత కూడా జీవితం ఉంది" అని, ఆ అవగాహన పెరిగే కొద్దీ ఆత్మ లక్ష్యం కూడా స్పష్టమవుతుంది.

ఇప్పటివరకు ఎన్నో లక్ష్యాలు సాధించినా అవేవీ అసలు లక్ష్యాలు కావని తెలుస్తుంది. అసలు లక్ష్యం పూర్ణాత్మ స్థితిని చేరుకోవడమే అని గ్రహిస్తారు. అప్పటి నుంచి మిగతా లక్ష్యాలన్నీ ప్రక్కనపెట్టి, ఆ లక్ష్యం సాధించడానికి అవసరమైన పూర్ణజ్ఞానం సంపాదించే ప్రయత్నం ప్రారంభమవుతుంది. సద్గురువు చెప్పిన విషయాలను ఆచరిస్తూ, ధ్యానం చేస్తూ, జ్ఞానాన్ని పెంచుకుంటూ క్రమంగా జ్ఞానవంతులవుతారు. ఇది ఒక్క జన్మలో పూర్తయ్యే పని కాదు. అందుకే పత్రి గారు **"జన్మ లేని స్థితిని చేరుకోవాలంటే అపారమైన జ్ఞానం సంపాదించాలి"** అని చెబుతారు.

ముందు "నేను స్త్రీని", "నేను పురుషుడిని", "నేను ఈ కులానికి చెందినవాడిని", "నేను ఈ మతానికి చెందినవాడిని" అనే భావాలు బలంగా ఉంటాయి. కానీ జ్ఞానం పెరిగే కొద్దీ ఇవన్నీ తాత్కాలికమని అర్థమవుతుంది.

ధ్యానం వల్ల కొసరు "నేను" యొక్క ప్రాముఖ్యం తగ్గుతుంది. అదే సమయంలో అసలు "నేను" అయిన ఆత్మ యొక్క ప్రాముఖ్యం పెరుగుతుంది. ఆత్మ ప్రాముఖ్యం పెరిగే కొద్దీ ఎన్నో విషయాలు అర్థమవుతాయి. "నేను ఎవరు?", "ఈ జన్మ ఎందుకు?", "నేను చేయవలసింది ఏమిటి?" అనే ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి.

ఇప్పటివరకు... చనిపోయే వరకు ఉన్న జీవితం గురించే నేర్చుకున్నారు. ఇప్పుడు మరణం తర్వాత ఏమవుతుందో కూడా తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతుంది. అప్పుడు ఎన్నో క్రొత్త విషయాలు తెలుస్తాయి. "ఇప్పటివరకు

నేను చేస్తున్నది తప్పు, చేయవలసింది వేరే ఉంది” అని తెలుసుకొని జీవితాన్నే మార్చుకుంటారు.

ఈ మార్పు చుట్టుప్రక్కల వారికి కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే ఆత్మ ప్రాముఖ్యం పెరిగే కొద్దీ మాయ ప్రభావం తగ్గుతుంది, మాయ ప్రభావం తగ్గే కొద్దీ మీరు వాస్తవంలో జీవించడం ప్రారంభిస్తారు. సాధారణంగా జీవించి ఉన్నప్పుడు చాలామంది మాయలోనే ఉంటారు, చనిపోయిన తర్వాత వాస్తవంలోకి వస్తారు. కానీ సద్గురువు లభించిన వారు జీవించి ఉన్నప్పుడే వాస్తవంలో జీవించడం ప్రారంభిస్తారు. ఈ శరీరం కొంతకాలం మాత్రమే ఉంటుంది, తర్వాత మాయమైపోతుంది. కానీ మాయ ప్రభావంలో ఉన్నప్పుడు దాన్నే “నేను” అనుకుంటారు, జ్ఞానం పెరిగిన తర్వాత “శరీరం నేను కాదు, ఆత్మే నేను” అని తెలుసుకుంటారు.

ఈ జీవితం శాశ్వతం కాదని అర్థమవుతుంది. ఇంతకాలం శాశ్వతం అనుకున్నదంతా తాత్కాలికమని తెలుస్తుంది. “నేను పురుషుడిని”, “నేను స్త్రీని”, “ఇవాళ్లు నా భార్య, నా భర్త, నా పిల్లలు, నా తల్లిదండ్రులు” అనే భావాలు కూడా క్రమంగా భ్రమలని అర్థమవుతుంది. అందరూ ఆత్మలే. ప్రతి ఒక్కరూ తమ తమ లక్ష్యసాధన కోసం శరీరాలను ధరించారు అని తెలుసుకుంటారు.

శంకరాచార్యులు చెప్పిన జాగ్రత్త పంచకం కూడా జ్ఞానం పెరిగే కొద్దీ మరింత స్పష్టంగా అర్థమవుతుంది. ఎప్పుడైతే ఆ సత్యం అర్థమవుతుందో, అప్పుడే మీరు మాయ నుంచి బయటపడి వాస్తవంలో జీవించడం ప్రారంభిస్తారు. కొసరు “నేను” ప్రభావాన్ని తగ్గించి, అసలు “నేను” అయిన ఆత్మ ప్రభావాన్ని పెంచినప్పుడే నిజమైన జీవితం ప్రారంభమవుతుంది. అప్పుడే మీరు మీ లక్ష్యానికి దగ్గరవుతారు.

మరణానంతర జీవితం గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటారో, అంత ఎక్కువ అవగాహన కలుగుతుంది. ఈ జీవితం శాశ్వతం కాదని, చుట్టూ

ఉన్నవి ఏవీ నిజంగా మీవి కావని అర్థమవుతుంది. చనిపోయిన తర్వాత సహాయకులు వచ్చి “వెళ్దాం” అని పిలిచినప్పుడు మాట్లాడకుండా వారితో వెళ్ళిపోతారు. ఇప్పటివరకు “ నా వాళ్ళు, ఇవే నావి” అని అనుకున్నవన్నీ తాత్కాలికమని తెలుస్తుంది. ఈ జీవితం కూడా శాశ్వతం కాదని స్పష్టమవుతుంది. ఈ అవగాహన పెరిగే కొద్దీ మీలో గొప్ప మార్పు వస్తుంది. కొసరు “నేను”ను (మనస్సు) వదిలి, అసలు “నేను” (ఆత్మ) వైపు మీ ప్రయాణం ప్రారంభమవుతుంది. క్రమంగా మీరు మీ లక్ష్యాన్ని చేరుకుంటారు. అందుకే మరణానంతర జీవితం గురించి ఎంత అవగాహన ఉంటే, అంతగా మీరు మీ అసలు లక్ష్యానికి దగ్గరవుతారు, జరుగుతున్న ఈ జీవితం శాశ్వతం కాదు అని తెలుసుకుంటారు.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# పై లోకమే నా అసలు లోకం, భూలోకం నాకు పర లోకం

ఇప్పుడు ఇంకొక ముఖ్యమైన అంశాన్ని తెలుసుకుందాం. మరణించిన తర్వాత తెలిసే విషయాల్లో ఒకటి **"పై లోకమే నా అసలు లోకం, భూలోకం నాకు పర లోకం"** అని తెలుసుకుంటారు.

సహజంగా భూమిపై ఉన్నప్పుడు, భూ లోకమే తన లోకం అని భావిస్తారు. పై లోకాల గురించి చాలా మందికి తెలియదు, పర లోకాలు ఉన్నాయని కూడా చాలామందికి తెలియదు కానీ జ్ఞానులకు తెలుస్తుంది.

అజ్ఞానులకు తెలియదు, అందువల్ల వారి జీవన విధానం ఎలా ఉంటుందంటే, ఈ భూమిపై ఉన్న జీవితం శాశ్వతమని భావిస్తూ, ఇక్కడ ఉన్నవన్నీ శాశ్వతమని అనుకుంటూ జీవిస్తారు. ఇక్కడ ఉన్న వారంతా తమ వారేనని భావిస్తూ, వారి కోసమే జీవిస్తూ ఉంటారు. భూమిపై ఉన్న వస్తువులను, సంపదలు తమవేనని వాటిని సంపాదించు కోవాలని ప్రయత్నిస్తారు.

గమనిస్తే, భూమిపై ధనవంతుడికి ఎక్కువ గౌరవం ఉంటుంది, ఎంత ఎక్కువ ధనం ఉంటే, అతను అంత గొప్పవాడని భావిస్తారు. ధనవంతుల తో మాట్లాడటానికి ఇష్టపడతారు, వారితో ఉండాలని కోరుకుంటారు, వారిలా ఎదగాలని ప్రయత్నిస్తారు, అందుకోసం తమ సమయాన్ని ఎక్కువగా ధన సంపాదనకే కేటాయిస్తారు.

ఆ ధనంతో పాటు స్థలాలు, ఆస్తులు, సంపదలు పెంచుకుంటారు, వాటిని చూసి మురిసిపోతూ ఉంటారు, వాటిని ప్రదర్శిస్తూ గర్విస్తారు కూడా. ఎందుకంటే భూమిపై తాము సంపాదించుకున్నవి శాశ్వతమని భావిస్తారు.

అలాగే భూమి పైకి ఒంటరిగా వచ్చినా, ఇక్కడ జన్మించిన కుటుంబం, బంధువులు, భార్య, పిల్లలు తమ వారేనని భావిస్తూ జీవిస్తారు. భార్య కోసం, పిల్లల కోసం రాత్రింబవళ్లు కష్టపడతారు. వారి కోసమే ఎన్నో పనులు చేస్తారు, కొన్నిసార్లు తప్పులు, పాపాలు కూడా చేస్తారు, అధర్మంగా కూడా వ్యవహరిస్తారు. తమ వారు కాని వారిని వేరే వారిగా భావించి, వారిని ద్వేషిస్తూ, వారికంటే

తాము గొప్పవారిగా ఉండాలని పోటీ పడుతూ ఉంటారు.

ఇదంతా భూమిపై ఉన్నప్పుడు జరిగేది. కానీ చనిపోయిన తర్వాత వీటిలో ఒక్కటి కూడా వెంట రాదు. ఒక్క వస్తువు వెంట రాదు, ఒక్క మనిషి కూడా వెంట రాడు అని తెలుసుకుంటాడు. చాలా విచిత్రమైన విషయం ఏమిటంటే, తన శరీరాన్ని కూడా తన వారే దహనం చేస్తారు లేదా పూడ్చిపెడతారు.

పై లోకానికి వెళ్లిన తర్వాత, ఆ శరీరం తాను కాదని తెలుసుకుంటారు, తన వారు అనుకున్నవారు నిజానికి తన వారు కాదని తెలుసుకుంటారు. తనవి అనుకున్నవన్నీ తనవి కావని అర్థమవుతుంది, జన్మంతా కష్టపడి సంపాదించుకున్నవి కూడా తనతో రాలేదని చూసి ఆశ్చర్యపోతాడు.

అప్పుడు తాను ఆత్మనని తెలుసుకుంటారు, భూలోకాన్ని వదిలి పై లోకానికి వెళ్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. ముఖ్యంగా **"పై లోకమే నా అసలు లోకం, భూలోకం నాకు పర లోకం అని తెలుసుకుంటారు".** తాను ఆత్మనని, పై లోకం నుంచి భూమి పైకి వచ్చానని అర్థం చేసుకుంటారు.

అప్పుడు భూమి గురించి ఒక గొప్ప సత్యం అర్థమవుతుంది. **"భూమిపై ఉన్నవి ఏవీ వెంట రావు, కానీ పై లోకాలలో సంపాదించిన ఎదుగుదలే నిజమైన ఎదుగుదల, భూమిపై సాధించిన ఎదుగుదల అసలు ఎదుగుదల కాదని తెలుసుకుంటారు".**

ఎందుకంటే పై లోకాలు అనేకం ఉన్నాయి, కానీ భూమి ఒక్కటే. భూమిపై ఎంత సంపాదించినా, ఎంత గొప్ప వారైనా, అవి శాశ్వతం కావు. కానీ పై లోకాలలో సంపాదించుకున్న జ్ఞానం, ఆధ్యాత్మిక ఎదుగుదల మాత్రం శాశ్వతంగా ఉంటుంది అని తెలుసుకుంటాడు.

ఇంకొక విషయం కూడా అర్థమవుతుంది. **"భూమి పైకి ఎన్ని సార్లు**

**వచ్చినా, పై లోకం నుంచే వస్తారు, అందువల్ల ఈ భూలోకం తన అసలు లోకం కాదని, తాత్కాలికంగా వచ్చిన లోకమని తెలుసుకుంటారు".** మరణించిన తర్వాత తెలిసే ఈ విషయాలను జీవించి ఉన్నప్పుడే తెలుసుకోగలిగిన వారు నిజంగా అదృష్టవంతులు. ఎందుకంటే ఈ సత్యాలు తెలిసినప్పుడు, ఉండని వాటికి ప్రాముఖ్యం ఇవ్వరు. నిజంగా ఉండే వాటికే, వెంట వచ్చే వాటికే ప్రాముఖ్యం ఇస్తారు.

అందుకే సద్గురువులు **"మరణించక ముందే మరణించాలి"** అని చెబుతారు. అంటే మరణించిన తర్వాత జరిగేవి జీవించి ఉన్నప్పుడే తెలుసుకోవాలి అని అర్థం. సద్గురువులు ఇంకా **"మీరు పై లోకం నుంచి భూలోకానికి పాఠాలు నేర్చుకోవడానికి వచ్చారు. ఇది ఒక పాఠశాల మాత్రమే. అంతకుమించి దీనితో మీకు సంబంధం లేదు"** అని చెబుతారు.

ఒక్కసారి ఆలోచించండి. చిన్నప్పుడు మీరు పాఠశాలకు ఎందుకు వెళ్తారు? పాఠాలు నేర్చుకోవడానికి. అక్కడ ఒక కుర్చీ, ఒక బల్ల, సామాను ఉంటాయి. చదువుతున్నంత కాలం అవి మీవిగా ఉపయోగిస్తారు. కానీ చదువు పూర్తయిన తర్వాత ఆ కుర్చీ, బల్ల, సామాను మీతో తీసుకెళ్తారా? తీసుకెళ్లరు.

అలాగే మీరు భూమి పైకి జీవిత పాఠాలు నేర్చుకోవడానికి వచ్చారు. అంతేకానీ ఇక్కడ ఉన్నవన్నీ మీవికాదు, మీరు వాటిని తీసుకెళ్లలేరు, అవి జ్ఞానం సంపాదించుకోవడానికి ఉన్నవి, ఒక పాఠశాల లాంటిదే భూమి కూడా. మీ అసలు లోకం సత్యలోకం, మీరు సత్యలోకం నుంచి వచ్చారు. జ్ఞానం నేర్చుకొని మళ్ళీ సత్యలోకానికే చేరుకుంటారు.

మీరు దేహ భ్రాంతిలో ఉన్నప్పుడు, మనస్సు యొక్క మాయలో ఉన్నప్పుడు ఇవేమీ తెలియవు. కానీ 350 జన్మల తర్వాత, సద్గురువు లభించిన తర్వాత, ఇవన్నీ అర్థమవుతాయి. ఒకసారి ఆలోచించండి, మీరు ఇంటి నుంచి బయలుదేరి ఒక టూర్ వెళ్ళారని అనుకోండి. మూడు నెలలు, ఆరు నెలలు లేదా ఒక సంవత్సరం పాటు ఎన్నో ప్రదేశాలు తిరిగారు, అక్కడ ఎన్నో గొప్ప

విషయాలు చూశారు, ఎన్నో అనుభవాలు పొందారు. అయినప్పటికీ మీ మనసులో ఒక ఆలోచన ఉంటుంది "ఎప్పుడు నా ఇంటికి చేరుకుంటానా?" అని.

ఎందుకంటే ఎంత తిరిగినా ఇంటికి చేరుకున్నప్పుడే నిజమైన ప్రశాంతత ఉంటుంది. అలాగే సత్యలోకం నుంచి వచ్చిన మీరు, తిరిగి సత్యలోకాన్ని చేరుకునే వరకు ఎన్ని జన్మలు తీసుకున్నా, ఎన్ని భోగాలు అనుభవించినా, లోలోపల మీ ఆత్మ, పూర్ణాత్మను చేరుకోవాలని కోరుకుంటూనే ఉంటుంది. అందుకే భూమిపై ఎన్ని విజయాలు సాధించినా, ఎంత పేరు, ప్రతిష్ఠ సంపాదించినా, లోపల ఏదో అసంతృప్తి ఉంటుంది. ఎందుకంటే లోపల ఉన్నది ఆత్మ, ఆత్మకు కావలసింది ఇవి కావు. ఆత్మకు తన అసలు స్వరూపాన్ని చేరుకోవాలని అనుకుంటుంది.

మరణించిన తర్వాత పై లోకాలకు చేరుకున్నప్పుడు, అక్కడి లోక వాసులు స్పష్టంగా చెబుతారు **"భూలోకం నీ అసలు లోకం కాదు, నువ్వు జ్ఞానం సంపాదించుకోవడానికి తాత్కాలికంగా వెళ్ళి వచ్చిన లోకం మాత్రమే"** అని చెబుతారు. అంతేకాదు, భూమిపై కొన్ని కోట్ల మంది మాత్రమే ఉంటారు, కానీ సృష్టిలో కోటానుకోట్ల లోకాలు ఉన్నాయి, అక్కడ ఉన్నవారి సంఖ్యను ఊహించడం కూడా కష్టం అని చెబుతారు.

మీరు గమనిస్తే, భూమిపై కొంతకాలం మాత్రమే ఉంటారు, కానీ పర లోకాలలో చాలా ఎక్కువ కాలం ఉంటారు. భూమిపై సంపాదించినవి శాశ్వతం కావు, కానీ పై లోకాలకు మీరు సంపాదించుకున్న జ్ఞానం, ఆధ్యాత్మిక ఎదుగుదల శాశ్వతంగా మీతో ఉంటుంది.

ఎలా ఒక విదేశానికి వెళ్ళి విద్యను సంపాదించుకొని తిరిగి వస్తారో! అలాగే పర లోకమైన భూలోకానికి వచ్చి జ్ఞానాన్ని సంపాదించి, మీ అసలు లోకమైన సత్యలోకంలో ఉన్నత స్థితిని సాధిస్తారు. అందుకే పత్రి గారు "మరణించక ముందే మరణించాలి" అని చెబుతారు.

# పూర్ణజ్ఞానం పొందాలంటే?

ఇప్పుడు ఇంకో విషయం తెలుసుకుందాం. ఎందుకంటే జీవించి ఉన్నప్పుడు మీకు కొన్ని విషయాలే తెలుస్తాయి, వాటి బట్టి మీ జీవితం కొనసాగిస్తారు, కానీ అది పరిపూర్ణం కాదు. అందుచేత జీవిత లక్ష్యాన్ని సాధించాలంటే, మానవుని జీవిత లక్ష్యమైన పూర్ణాత్మ స్థితిని చేరాలంటే పూర్ణజ్ఞానం అవసరం. పూర్ణజ్ఞానం పొందాలంటే మరణించిన తర్వాత జరిగే విషయాలను కూడా తెలుసుకోవాలి.

సహజంగా మరణానంతరం జరిగేది తెలియకపోవడం వల్ల ఎంతో మంది ఎన్నో రకాలుగా నష్టపోతారు. జీవించి ఉన్నవారు కనిపించేవే శాశ్వతమని, అదే జీవితం అని అనిపిస్తుంది. కానీ మరణానంతర జీవితం గురించి తెలుసుకుంటే, తెలుసుకోవలసింది ఇంకా ఎంతో ఉందని అర్థమవుతుంది.

అందుకే గత కొన్ని రోజులుగా ఆ విషయాల గురించే తెలుసు కుంటున్నారు. మరణించిన తర్వాత పై లోకాల నుంచి ఇద్దరు సహాయకులు వస్తారు. వారు మీరు చేసిన కర్మలను బట్టి, ఏ లోకానికి తీసుకెళ్ళాలో ఆ లోకానికి తీసుకెళ్లడానికి వస్తారు. వారు వచ్చి, “ఇక్కడ నీ పని పూర్తయింది, వెళ్దాం నడు” అని చెబుతారు. కానీ జన్మంతా కుటుంబాన్ని పెంచుకున్నాడు, బంధువులను సంపాదించుకున్నాడు, ఎంతో మంది స్నేహితులను కలుపు కున్నాడు, భార్యా పిల్లలతో జీవించాడు. అటువంటి వ్యక్తికి ఒక్కసారిగా అన్నింటినీ వదిలేసి రావడం సులభం కాదు.

“ఇప్పటివరకు వాళ్ళతోనే కదా జీవించాను, ఇప్పుడు వాళ్లందరినీ వదిలి ఎలా వస్తాను?” అని అంటాడు. తన వారంతా బాధపడుతుంటే, వారిని వదిలేసి ఎలా వస్తాను? రాను అంటాడు. అంతేకాదు ఎంతో డబ్బు

సంపాదించాడు, ఆస్తులు కూడబెట్టాడు, గొప్పగా జీవించాడు, అలాంటి వాటన్నింటినీ వదిలేసి ఎలా వస్తాడు? రాను అంటాడు.

అలా పదకొండు రోజులు అయినా సహాయకులు కూడా వెళ్ళరు. అలా ఉండిపోయిన ఆత్మను ప్రేతాత్మ అంటారు, ఆ ప్రేతాత్మ భూమి మీద ఏమీ చేయలేక, ఎవరూ పట్టించుకోక, ఏం చేయాలో తెలియక కొన్ని వందల సంవత్సరాలు ఉండిపోతుంది.

కానీ మరణానంతర జీవితం గురించి అవగాహన ఉన్నవారికి ఇవన్నీ ముందుగానే తెలుస్తాయి. అందుచేత చనిపోయిన తర్వాత పై లోకాల నుంచి వచ్చిన సహాయకులతో నిశ్చింతగా వెళ్ళిపోతారు. దాని వల్ల కొన్ని వందల సంవత్సరాల సమయం వృథా కాకుండా చూసుకుంటారు.

ఇవన్నీ తెలుసుకోవడం వల్ల, ఒకవేళ సడన్‌గాఎవరైనా శరీరాన్ని విడిచిపెట్టారు అనుకోండి, అప్పుడు దెయ్యంగా భూమి మీద ఉండరు, సహాయకుల కూడా వెళ్లిపోతారు.

కాని మీ ఆస్తులు వదిలేయాలా? భర్తను, భార్యను కూడా వదిలేయాలా? అని అడగవచ్చు. కానీ మీరు తెలుసుకుంటున్న జ్ఞానం వల్ల మామూలుగా జరిగే జీవితం పూర్తిగా మారిపోతుంది. మామూలుగా జీవించే జీవితం “నేను దేహాన్ని” అన్న భావనతో ఉంటుంది. కానీ జ్ఞానం వచ్చిన తర్వాత “నేను ఆత్మను” అన్న భావనతో జీవితం మారిపోతుంది.

ఇంతవరకు దేహానికే ప్రాధాన్యం ఇచ్చారు, దేహానికి సంబంధించిన పిల్లలు, బంధువులు, ధనం, సంపదలు వాటికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు కానీ మరణించిన తర్వాత వీటితో తనకు ఎలాంటి సంబంధం లేదని అర్థమవుతుంది. అది తెలుసుకున్నపుడు వాటిని ప్రక్కన పెట్టి ఆత్మకు సంబంధించిన విషయాలపై దృష్టి పెడతారు, ఆత్మ లాభం కోసం, ఆత్మ ఎదుగుదల కోసం కృషి చేస్తారు. అలా అన్ని విషయాల్లో కూడా మార్పు

వస్తుంది.

సహజంగా చనిపోయిన తర్వాత "నేను ఆత్మను" అన్న విషయం తెలుస్తుంది, లేదా మూడో కన్ను సంపాదించుకున్న వారికి తెలుస్తుంది, లేదా జ్ఞానం సంపాదించుకున్న వారికి తెలుస్తుంది, లేదా సద్గురువు లభించి ఆయన బోధనలను అర్థం చేసుకున్న వారికి తెలుస్తుంది. అలా తెలుసుకున్నవారి జీవితాల్లో ఎంతో మార్పు వస్తుంది, దానికి ఉదాహరణగా మా ఇద్దరి జీవితాలనే చెప్పుకోవచ్చు. దాదాపు యాభై సంవత్సరాల పాటు నేను దేహం అన్న భావంతోనే జీవించాము.

కానీ పత్రి గారు చాలా సింపుల్‌గా చెప్పారు. "నువ్వు దేహం కాదు" అన్నారు. "మరి నేను ఎవరు?" అని అడిగితే, "నువ్వు ఆత్మవు" అన్నారు.

అప్పుడు నేను చాలా గ్రంథాలు చదివాను, చాలా సందేశాలు విన్నాను, ఎంతో మంది స్వామీజీల బోధనలు విన్నాను. అప్పుడు పత్రి గారు చెప్పిన విషయం చాలా స్పష్టంగా అర్థమైంది. ప్రజలు ధనాన్ని సంపాదిస్తూ, ఆ ధనాన్నే జీవిత లక్ష్యంగా భావిస్తూ నష్టపోతున్నారు.

కానీ నేను ఆత్మను అని తెలుసుకున్న తర్వాత, ఈ ధనం ఆత్మకు ఎలాంటి లాభం చేకూర్చదని అర్థమైంది. ఆత్మకు లాభం కలిగించేది జ్ఞానం మాత్రమే అని పత్రి గారి ద్వారా తెలుసుకోవడం జరిగింది.

అప్పటి నుంచి దేహానికి లాభం కలిగించే ధన సంపాదన కంటే, ఆత్మకు లాభం కలిగించే జ్ఞాన సంపాదనను ప్రారంభించాము, గత ఇరవై మూడు సంవత్సరాలుగా అదే పని చేస్తున్నాము, మా ఇద్దరి జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. మా ధనాన్ని, మా సమయాన్ని, మా వాక్కును, మా శక్తిని, మాకు ఉన్న ఆయుష్షును కూడా భూమి మీద ఉన్నంతకాలం ఆత్మలాభం కోసం ఉపయోగించాలని నిర్ణయించుకున్నాము.

అలాగే మా ఆహారపు అలవాట్లు మారిపోయాయి, మేము వెళ్ళే

ప్రదేశాలు మారిపోయాయి, పార్టీలు, వినోద కార్యక్రమాలు తగ్గిపోయాయి, మా బంధుత్వాల స్వరూపం కూడా మారిపోయింది. ఇంతవరకు దేహ సంబంధమైన బంధువులు మాత్రమే ఉండేవారు, ఇప్పుడు ఆత్మ బంధువులు వేల సంఖ్యలో ఉన్నారు. దేహ బంధువులు కొద్దిమందే ఉండేవారు, కానీ ఆత్మ బంధువులు ఎంతో మంది అయ్యారు. చదివే పుస్తకాలు కూడా మారిపోయాయి, కాలక్షేపం కోసం చదివే పుస్తకాల స్థానంలో జ్ఞానాన్ని అందించే పుస్తకాలు వచ్చాయి, మా ఇంటికి వచ్చే పరిచయస్తులు కూడా మారిపోయారు.

ఇంతకు ముందు వినోదం కోసం తిరిగే వారం, ఇప్పుడు విజ్ఞాన కార్యక్రమాలకు వెళ్తున్నాం. ఒక ఆలోచన మారితే జీవితమంతా మారిపోతుందని మా జీవితంలో తెలుసుకున్నాం. ఇంతకుముందు నేను వ్యాపారం చేసేవాడిని, వ్యాపార సమస్యలు, లాభనష్టాలు, డబ్బు గురించే ఎక్కువగా ఆలోచించేవాడిని. ఇంటికి వచ్చిన తర్వాత మా మనవలతో కాలక్షేపం చేస్తూ, “వాళ్లు ఉన్నారు కాబట్టే జీవితం ఆనందంగా ఉంది” అని అనుకునేవాడిని.

కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మనవళ్ళు ముని మనవళ్ళు వచ్చినా వారితో ఉండేకంటే, ఆత్మ లాభం కోసం సమయాన్ని ఉపయోగించుకోవాలని అనిపిస్తోంది. మా ఇద్దరిలో ఎంత మార్పు వచ్చిందో చూడండి. ఇంతకుముందు బంధువులు పిలిస్తే వెళ్ళకపోతే ఏమనుకుంటారో అని ఆలోచించే వారం, కానీ ఇప్పుడు “ఎవరు ఏమనుకుంటే మాకేమిటి? మేము ఇక్కడ శాశ్వతంగా ఉండము, వారు కూడా శాశ్వతంగా ఉండరు” అనే అవగాహన వచ్చింది. దాని కోసం ఆత్మను ఎందుకు నష్టపరుచుకోవాలి అని తెలిసింది.

అలాంటి స్థితి వచ్చింది. ఉదాహరణకు, పత్రి గారు మా ఇంటికి వస్తున్నారు అంటే ఒకప్పుడు ఆయన కోసం ఎదురు చూసేవాడిని. కానీ నేను ఒకటి లేదా రెండు నెలల ముందే కార్యక్రమాలు నిర్ణయించుకుని ఉండే వాడిని.

ప్రజల కోసం కార్యక్రమాలను ఖరారు చేసిన తర్వాత, సడన్‌గా పత్రి గారు వస్తున్నారని తెలిసినా, ఆ సమయంలో నాకు వేరే కార్యక్రమం ఉండడం వల్ల వెళ్లలేదు. మా మేడమ్ ఉన్నారు కాబట్టి ఆమె చూసుకుంటారని భావించాను.

ఒకసారి పత్రి గారు ఏమన్నారంటే, "ప్రోగ్రామ్ క్యాన్సిల్ చేయడం కూడా నేర్చుకోవాలయ్యా" అన్నారు, కాని ఎందుకు అన్నారో తెలియదు.

ఎందుకంటే ఒక కార్యక్రమానికి మాట ఇచ్చిన తర్వాత ఎలాంటి పరిస్థితుల్లోనైనా దాన్ని పూర్తి చేయాలి. కొంచెం ఆలోచించండి! మొన్న మైసూరులో కార్యక్రమం కోసం అరుణ్ కుమార్ ఎంతో ఖర్చు పెట్టాడు, ఎన్నో రోజులుగా ఏర్పాట్లు చేశాడు. అలాంటి కార్యక్రమాన్ని క్యాన్సిల్ చేస్తే ఎలా ఉంటుంది? అందుచేత కార్యక్రమానికి ఒప్పుకున్న తర్వాత, ఎంత కష్టమైనా పాల్గొనడం చేస్తున్నాము.

దాదాపు పది, పదిహేను సంవత్సరాల క్రితం రాయచోటి మూడు రోజుల కార్యక్రమానికి ఒప్పుకున్నాను. శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి చేరుకుని, అక్కడి నుంచి బస్సులో రాయచోటి వెళ్ళాలి. కానీ రైలు దాదాపు పది గంటలు ఆలస్యమైంది, కార్యక్రమం ఉదయం పది గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అప్పుడు విజయవాడ వెళ్ళి అక్కడి నుంచి తిరుపతి బస్సు ఎక్కాను. కాని సమయం సరిపోదని భావించి నెల్లూరులో దిగిపోయాను.

కానీ అక్కడికి వెళ్లాక మరో సమస్య వచ్చింది, అర్ధరాత్రి బస్సులు లేవు. ఎంక్వైరీ చేస్తే, "ముందు ఒక ఊరికి వెళ్ళండి, అక్కడి నుంచి ఇంకో బస్సు దొరుకుతుంది" అన్నారు. అక్కడికి వెళ్ళాక మళ్ళీ ఇంకో ఊరికి వెళ్లమన్నారు, చివరకు ఆటోలో వెళ్లాల్సి వచ్చింది. ఆటోల్లో ఎలా ఉంటుందో మీకు తెలుసు కదా, జనాన్ని కుక్కేస్తారు. అయినా వెళ్ళాను. మొత్తానికి ఆ కార్యక్రమానికి సమయానికి చేరుకున్నాను. అప్పుడు నేను అనుకున్నది ఒక్కటే!

“ఇది నాకు పరీక్ష, ఈ పరీక్షలో నేను సక్సెస్ కావాలి” అని.

ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి నా జీవితంలో చాలా చోట్ల జరిగాయి. నేను దేహమే అని అనుకుంటే ఇన్ని కష్టాలు పడేవాడిని కాదు. కానీ నేను ఆత్మను అనే అవగాహన వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయి. సహజంగా కుటుంబంలో చిన్న చిన్న ఫంక్షన్లు, వేడుకలు చాలా ఉంటాయి. మాది కూడా పెద్ద కుటుంబమే, ఎప్పుడూ ఎవరో ఒకరు పిలుస్తూనే ఉంటారు. మొదట్లో మా మేడమ్ మాత్రమే వెళ్ళేవారు, నాకు క్లాసులకు వెళ్ళడానికి అవకాశం ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఆమె నన్ను మించిపోయింది.


మొదట్లో ఆమె ఎక్కడికి వెళ్ళినా “నేను రాఘవరావు గారి భార్యను” అని పరిచయం చేసుకునేది. ఇప్పుడు ఆమె పరిస్థితి పూర్తిగా అందరికీ తెలిసిన వ్యక్తిగా మారిపోయింది. ఇప్పుడు మీరు గమనించండి, నేను ఇక్కడ ఉన్నా, ఆమె తన పని చేసుకుంటుంది. ఆమె అక్కడ ఉన్నా, నేను నా పని చేసుకుంటాను, ఎవరి పని వారు చేసుకుంటున్నాము.

ఎందుకంటే ఉన్న కొద్దిపాటి జీవితంలో  ఆత్మలాభం కోసం కృషి చేయాలి. ఎప్పుడైతే  ఆత్మసేవ చేస్తారో, ప్రకృతి కూడా మీకు సహకరిస్తుంది, మీ పిల్లలు సహకరిస్తారు. లోకం కోసం మీరు పనిచేస్తే, లోకేశుడు మిమ్మల్ని చూసుకుంటాడు. నేను 2003లో వ్యాపారాలన్నీ మానేశాను, అప్పుడు చాలామంది బంధువులు, స్నేహితులు “వ్యాపారం బాగా జరుగుతుంటే ఎవరు ఆపేస్తారు?” అని అనుకున్నారు. కానీ నాకు తెలిసిన విషయం వారికి తెలియదు. నేను పిచ్చివాడిని కాదు, నాకు ఉన్నది జ్ఞాన పిచ్చి, కాని ధనపిచ్చి కాదు. ఆలోచించండి! ధనం గొప్పదా? జ్ఞానం గొప్పదా?

మా మేడమ్‌కు ఒకసారి తీవ్రమైన ఆరోగ్య సమస్య వచ్చింది. మోకాళ్ల నొప్పులు, ప్రమాదాలు, అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పుడు ఆమె, “నేను సీరియస్‌గా ధ్యానం చేస్తాను. తగ్గితే పత్రి గారితోనే ఉంటాను. తగ్గకపోతే

వదిలేస్తాను" అని అనుకుంది, కానీ ఆమె చేసిన ధ్యానం, ఆమె పట్టుదల వల్ల ఆమెలో అద్భుతమైన మార్పు వచ్చింది. అలాగే అగ్ని ప్రమాదం సమయంలో ఎంత కష్టం అనుభవించిందో! తర్వాత అంతే ధైర్యంగా బయటకు వవచ్చింది. ఈ రోజు  అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

కానీ ఆమె అలా మంచం మీదే ఉండిపోతుందేమో అనుకున్నాను. ఆమె పరిస్థితి అప్పుడు అలా వుంది. కానీ ఆమె మాత్రం మామూలు మనిషి అయింది. అదే ధ్యానం యొక్క గొప్పతనం, అదే జ్ఞానం యొక్క గొప్పతనం. మేమిద్దరం ఒక విషయం అర్థం చేసుకున్నాము. ఈ శరీరం మేము కాదు, కొన్నాళ్ల తర్వాత దీనిని వదిలేయాల్సిందే. ఇక్కడ సంపాదించిన ఆస్తులు, సంపదలు ఏవీ వెంట రావు, కానీ సంపాదించుకున్న జ్ఞానం మాత్రం వెంట వస్తుంది, అందుకే ఇప్పుడు మా ప్రయత్నమంతా ఆ దిశగానే ఉంది. ప్రకృతి ఎంత అవకాశం ఇస్తే, ఎంత చేయగలమో అంత చేయాలి, అదే పత్రి గారిని చూసి మేము నేర్చుకున్నది.

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : **సింధూర, సెల్: 8555995217**

# పిరమిడ్ మాస్టర్ల 18 ఆదర్శ సూత్రాలు

1. సరియైన ధ్యానం అంటే "ఆనాపానసతి" ధ్యానం చేయడం, అందరి చేతా చేయించడం.
2. సరియైన ఆధ్యాత్మిక పుస్తకాలను చదవడం; వాటినే అందరి చేతా చదివించడం.
3. ధ్యానానుభవాలనూ, పుస్తక జ్ఞానాన్నీ విధిగా అందరూ పరస్పరం పంచుకోవడం.
4. విధిగా పౌర్ణిమ ధ్యానం చేయడం ; అందరిచేతా పౌర్ణమి ధ్యానాన్ని చేయించడం.
5. వీలయినంత మౌనం పాటించడం.
6. వీలయినప్పుడల్లా పిరమిడ్ శక్తిని ఉపయోగించుకోవడం.
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి.
8. మాంసాహారం ససేమిరా తినకపోవడం! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమిత ఆహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్నప్పటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ ఇవ్వడం.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణలో 'డబ్బు ఇచ్చి పుచ్చుకోవడాలు' అన్నది ఏ మాత్రం లేకపోవడం.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ సత్యఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. ఎవరి సమస్యలను వారే, తమ తమ స్వీయ ఆత్మశక్తిని ఉపయోగించి పరిష్కరించుకోవడం.
16. గృహస్థులుగా వుంటూనే, ఎవరి పనులు వారు చూసుకుంటూనే, జీవన్ముక్తిని సాధించడం.
17. అన్ని గ్రామాల లోనూ, అన్ని పట్టణాలలోనూ విధిగా పిరమిడ్ ధ్యానకేంద్రాలు నెలకొల్పడం.
18. పిరమిడ్ మాస్టర్లందరూ తమ తమ ధ్యానానుభవాలను గ్రంథరూపం చేసి విధిగా ప్రచురించాలి.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణంతర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు -రూ.90/-
23) ముఖ్యమైన సందేశాలు-1 -రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 -రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
30) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
31) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
32) జ్ఞాన జ్యోతి - రూ.70/-
33) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
34) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
35) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
36) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
37) బుద్ధుని సందేశాలు - రూ.70/-
38) భూతదయే దైవత్వం - రూ.70/-
39) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
40) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
41) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
42) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
43) మానవునిలోని చెడు -రూ.70/-
44) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
45) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
46) మోక్షం అంటే? - రూ.70/-
47) కబీరు సందేశాలు-1 -రూ.70/-
48) మనసు-1 - రూ.70/-
49) మనసు-2 - రూ.70/-
50) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
51) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
52) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
53) కబీరు సందేశాలు-2 - రూ.60/-
54) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
55) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
56) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
57) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
58) అతీంద్రియ శక్తులు - రూ.60/-
59) ఆలోచించండి - రూ.60/-
60) నిర్వాణ మార్గం - రూ.60/-
61) ధ్యానులకు సూచనలు - రూ.60/-
62) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
63) మమకారం - రూ.60/-
64) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
65) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
66) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
67) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
68) సంకల్పమంటే? - రూ.50/-
69) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
70) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
71) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
72) అరిహంత్ - రూ.50/-
73) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
74) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
75) విదురుని సందేశాలు - రూ.40/-
76) మూడురకాల జీవితాలు - రూ.40/-
77) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
78) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
79) బ్రహ్మం అంటే? - రూ.40/-
80) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
81) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
82) మహాత్ముల సందేశాలు - రూ.40/-
83) సత్యం - రూ.40/-
84) చక్రాలు - రూ.40/-
85) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
86) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
87) మౌన ధ్యానం - రూ.40/-
88) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
89) శాకాహారమే మానవాహారం - రూ.15/-
90) అహింస మరియు శాఖాహారం - రూ.15/-



ప్రతి ఒక్కరూ మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవాలి. అప్పుడు మాత్రమే జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తులు, సంపదలు, వస్తువులు తమతో రావని స్పష్టంగా తెలుస్తుంది. శరీర సుఖం, శరీర ఆనందం, శరీర వినోదం కోసం చేసే అధిక ఖర్చులు ఆత్మకు ఎలాంటి లాభం చేకూర్చవు, ఆత్మకు లాభం కలిగించే పనులే మరణానంతరం ఉపయోగపడతాయి, కానీ శరీరం కోసం చేసిన ఖర్చులు మరణానంతరం ఉపయోగపడవు.

అందువల్ల శాశ్వతం కాని వాటికి ప్రాముఖ్యం ఇవ్వకుండా, శాశ్వత విలువ కలిగిన వాటికే ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ జీవితం శాశ్వతం కాదని, ఒక రోజు ఈ శరీరాన్ని విడిచి వెళ్లాల్సిందేనని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. "నా అసలైన లోకం పై లోకమే, ఈ భూలోకం నాకు పరలోకం" అన్న అవగాహనకు రావాలి. మరణానంతర జీవితం గురించి అవగాహన పెరిగినప్పుడు, భూలోకంలో చేసే కర్మకాండల అసలు ప్రయోజనం లేదని గ్రహిస్తారు. అందుచేత ఈ భూమిమీద జీవించేటప్పుడే దేనికి ప్రాముఖ్యత ఇవ్వాలో దానికే ప్రాముఖ్యత ఇస్తారు, అప్పుడు వారు వారి జీవితములో విజయాన్ని సాధిస్తారు.

- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు

రూ.70/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| **Telugu Books** | **English Books** | **Hindi Books** | **Kannada Books** | **Tamil Books** |